ప్రజాశక్తి

శుక్రవారం ఏప్రిల్ 26 2024 | 8 పేజీలు

శ్రీకాకుళం

స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద భద్రతా ఏర్పాట్లు పరిశీలన

(8లో)

ముగిసిన నామినేషన్ల ఘట్టం

- ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు 131 నామినేషన్లు
- శ్రీకాకుళం లోక్‌సభ స్థానానికి 16 నామినేషన్లు
- నేడు నామినేషన్ల పరిశీలన

నామినేషన్ దాఖలు చేస్తున్న శ్రీకాకుళం టిడిపి అభ్యర్థి గొండు శంకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సార్వత్రిక ఎన్నికల్లో ప్రధానమైన నామినేషన్ల స్వీకరణ ఘట్టం గురువారంతో ముగిసింది. బరిలో నిలిచేందుకు ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్రులు కూడా ఉత్సాహం చూపారు. జిల్లావ్యాప్తంగా ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు శ్రీకాకుళం పార్లమెంటు స్థానానికి 147 నామినేషన్లు దాఖలయ్యాయి. జిల్లాలో ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు 131 నామినేషన్లు దాఖలు కాగా, శ్రీకాకుళం లోక్‌సభ స్థానానికి 16 నామినేషన్లు వచ్చాయి. వీటిని శుక్రవారం పరిశీలించి, నిబంధనలకు అనుగుణంగా లేని వాటిని తిరస్కరించనున్నారు. అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకునేందుకు ఈనెల 29వ తేదీ తుది గడువు. అదే రోజు సాయంత్రం ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించనున్నారు.

నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైన ఈనెల 18 నుంచి గడువు ముగిసిన 25వ తేదీ వరకు జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు 131 మంది అభ్యర్థులు 216 సెట్ల నామినేషన్లు (మిగతా...2లో)

జెఇఇ మెయిన్స్‌లో జిల్లా విద్యార్థుల సత్తా

జలుమూరు విద్యార్థికి ఎనిమిదో ర్యాంకు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారు. ఉత్తమ ర్యాంకులు సాధించి సత్తా చాటారు. జలుమూరు మండలం కరవంజకు చెందిన చింతు సతీష్ కుమార్‌కు జాతీయ స్థాయిలో జనరల్ కేటగిరీలో ఎనిమిదో ర్యాంకు వచ్చింది. ఒబిసి కోటాలో రెండో ర్యాంకు దక్కింది. ఈయన తండ్రి బుచ్చన్న పాలకొండ మండలం లుంబూరులో, తల్లి రేగిడి ఆమదాలవలసలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. వీరు ప్రస్తుతం పాలకొండలో ఉంటున్నారు. కోటబొమ్మాళికి చెందిన ఎస్.సాయి బదరీష్ జనరల్ కేటగిరీలో 1112వ ర్యాంకు, ఒబిసి కోటాలో 129వ ర్యాంకు సాధించారు. తండ్రి గుప్త బంగారం వ్యాపారం చేస్తుండగా, తల్లి శ్రీలక్ష్మి గృహిణి. సాయి బదరీష్ ఇంటర్‌లో 978 మార్కులు సాధించారు. ఉమ్మడి జిల్లా రాజాంకు చెందిన ఎం.మణికంఠ పృథ్వీరాజ్ 92వ ర్యాంకు సాధించారు. రాజాం లోని (మిగతా...2లో)

చింతు సతీష్ కుమార్
జనరల్ 8 / ఒబిసి 2

ఎస్.సాయి బదరీష్
జనరల్ 1112 / ఒబిసి 129

ఎస్.ఎస్.వి భావన
జనరల్ 1740 / ఒబిసి 301

మాట్లాడుతున్న కృపారాణి తదితరులు

కాంగ్రెస్‌తోనే రాష్ట్రానికి ప్రత్యేక హోదా

- ప్రాంతీయ పార్టీలకు ఓటు వేస్తే బిజెపికి వేసినట్లే
- ఇండియా ఫోరం అభ్యర్థులను గెలిపించాలి
- కేంద్ర మాజీ మంత్రి కృపారాణి

ప్రజాశక్తి - టెక్కలి

రాష్ట్రానికి ప్రత్యేక హోదా కాంగ్రెస్‌తోనే సాధ్యమని కేంద్ర మాజీ మంత్రి, టెక్కలి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కిల్లి కృపారాణి, డిసిసి అధ్యక్షులు ఎంపీ అభ్యర్థి పేడాడ పరమేశ్వరరావు అన్నారు. కృపారాణి నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రత్యేక హోదా ఇస్తామని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మోసం చేసిందని ధ్వజమెత్తారు. విభజన హామీలను అమలు చేయకుండా రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందని చెప్పారు. అటువంటి పార్టీతో టిడిపి, జనసేన జత కట్టాయని దుయ్యబట్టారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కూడా బిజెపితో రహస్య చెలిమి చేస్తోందని విమర్శించారు. ఈ (మిగతా...2లో)

ఓపెన్ టెన్త్, ఇంటర్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్ సొసైటీ) ఆధ్వర్యాన నిర్వహించిన పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. మార్చి 18 నుంచి 26వ తేదీ వరకు ఈ పరీక్షలు నిర్వహించగా, ఈనెల 12 నుంచి 16వ తేదీ వరకు స్పాట్ వాల్యూయేషన్ పూర్తయింది. ఈ ఏడాది జిల్లాలో ఓపెన్ స్కూల్ పరిధిలో పదో తరగతి పరీక్షలకు 767 మంది హాజరు కాగా 280 మంది (36.51 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్మీడియట్ పరీక్షలకు 1705 మంది హాజరు కాగా 561 మంది (32.90 శాతం) ఉత్తీర్ణులయ్యారు. పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రంలో జిల్లా 17వ స్థానంలో నిలవగా, ఇంటర్‌లో 23వ స్థానంలో నిలిచింది. ఈనెల 29 నుంచి మే ఏడో తేదీ వరకు రీ వాల్యూయేషన్, రీకౌంటింగ్‌కు అవకాశం (మిగతా...2లో)

చంద్రబాబుకు పరాభవం తప్పదు

స్పీకర్ తమ్మినేని సీతారాం

సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుకు ఈ ఎన్నికల్లో పరాభవం తప్పదని శాసనసభ స్పీకర్, ఆమదాలవలస వైసిపి అభ్యర్థి తమ్మినేని సీతారాం అన్నారు. పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజాగళం సభలో తన పని అయిపోయిందని చంద్రబాబు అన్నారని, రాష్ట్రంలో ఎవరి పని అయిపోయిందో జూన్ 4న తెలుస్తుందన్నారు. ఒడిశాకు తాను పారిపోతానో, టిడిపిని ప్రజలు బంగాళాఖాతంలో కలుపుతారో ఆరోజున చూద్దామని చెప్పారు. సిఎం జగన్మోహన్ రెడ్డిని సైకో అని సంబోధిస్తున్నారని, జగన్ కూడా అదే పంథాలో వెళ్తే చంద్రబాబు, టిడిపి నాయకులు రోడ్డు మీద తిరగగలిగే వారా అని ప్రశ్నించారు. ఫార్టీ ఇయర్స్ ఇండస్ట్రీ, మూడుసార్లు ముఖ్యమంత్రిని అంటున్న చంద్రబాబుకు మాట్లాడడం చేతకాదన్నారు. అవినీతిపరులు ఎవరో ప్రజలకు తెలుసునని, రెండెకరాల భూమి ఉన్న చంద్రబాబు నాయుడు కోట్లకు అధిపతి ఎలా అయ్యాడో ప్రజలకు తెలుసునన్నారు. (మిగతా...2లో)

ఉల్లంఘనలపై ఫిర్యాదు చేయండి

జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సార్వత్రిక ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేకంగా పరిశీలకులను ఎన్నికల సంఘం నియమించిందని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్ చెప్పారు. ఎన్నికల్లో అభ్యర్థులు, పార్టీలు చేస్తున్న వ్యయానికి సంబంధించి ఏవైనా ఫిర్యాదులు ఉంటే పరిశీలకులకు నేరుగా కలిసి ఫిర్యాదు చేయొచ్చని తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినా ప్రజలు, రాజకీయ పార్టీలకు చెందిన వారూ ఆయా ఫోన్ నంబర్లకు ఫిర్యాదు చేయొచ్చని సూచించారు.

పరిశీలకుల నంబర్లు

శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ సాధారణ ఎన్నికల పరిశీలకులు, సీనియర్ ఐఎఎస్ అధికారి శేఖర్ విద్యార్థికి చెందిన 9032923131 ఫోన్ నంబరుకు పార్లమెంటు పరిధిలోని ఫిర్యాదులు ఫోన్ చేసి తెలియజేయవచ్చని చెప్పారు. శ్రీకాకుళం, (మిగతా...2లో)

ఓటు హక్కు వజ్రాయుధం

బిఆర్ఎయు విసి రజని

మాట్లాడుతున్న బిఆర్ఎయు విసి రజని

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

ప్రజాస్వామ్య భారతదేశంలో ఓటు హక్కు వజ్రాయుధమని, దాన్ని వినియోగించుకోవడం ప్రతిఒక్కరి బాధ్యత అని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ కె.ఆర్ రజని అన్నారు. 'ఓటు విద్య - ఎన్నికల వ్యవస్థలో భాగస్వామ్యం' అనే అంశంపై కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వశాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సిబిసి), వర్శిటీ జర్నలిజం అండ్ మాస్ (మిగతా...2లో)

పరిశీలిస్తున్న వ్యయ పరిశీలకులు నవీన్ సోనీ

కంట్రోల్‌రూమ్ పరిశీలన

శ్రీకాకుళం : నూతన కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్‌రూమ్‌ను ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, పాతపట్నం శాసనసభా నియోజకవర్గాలకు సంబంధించి వ్యయ పరిశీలకులు నవీన్ కుమార్ సోనీ, సాధారణ పరిశీలకులు సందీప్ కుమార్ గురువారం పరిశీలించారు. కంట్రోల్‌రూమ్‌లో మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ, సోషల్ మీడియా, కంప్లైంట్ మానిటరింగ్ సెల్, సి-విజిల్ టీమ్, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్, బ్యాలెట్ పేపర్లు, పోస్టల్ బ్యాలెట్, ఎలక్షన్ ఎక్స్‌పెండేచర్, ఎక్సైజ్, పోలీస్ కంట్రోల్‌రూమ్‌ను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కంట్రోల్ రూమ్ ఇన్‌ఛార్జి టి.వెంకటేశ్వర్‌రావు, నోడల్ అధికారులు కె.చెన్నకేశవరావు, ఎం.గణపతిరావు, ఆర్.శ్రీనివాసరావు, కిరణ్ కుమార్, లక్ష్మీప్రసన్న, వాసుదేవరావు, ప్రసాదరావు, చిట్టిరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల పోలీస్ పరిశీలకులు రాక

పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్‌పి రాధిక

శ్రీకాకుళం : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎన్నికల పోలీసు పరిశీలకులు మహారాష్ట్రకు చెందిన సీనియర్ ఐపిఎస్ అధికారి దిగంబర్ పి.ప్రదాన్ గురువారం జిల్లాకు చేరుకున్నారు. ఆయన శ్రీకాకుళం, ఆమదాలవలస, నరసన్నపేట, పాతపట్నం, టెక్కలి, పలాస, ఇచ్ఛాపురం అసెంబ్లీ నియోజకవర్గాలకు ఆయన ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరిస్తారు. జిల్లా పోలీసు కార్యాలయం అతిథిగృహంలో ఎస్‌పి జి.ఆర్ రాధిక ఆయన్ను గౌరవపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం జిల్లాలో సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోలీసు శాఖ తీసుకున్న చర్యలు, పలు అంశాలపై చర్చించారు. ఆయన్ను కలిసిన వారిలో ఎఎస్‌పి జి.ప్రేమ్‌కాజల్ ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎన్నికల సాధారణ పరిశీలకులు

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలో సార్వత్రిక ఎన్నికల పరిశీలనకు వచ్చిన సాధారణ పరిశీలకులు, ఐఎఎస్ అధికారి సందీప్ కుమార్ కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబరులో కలిసి ఎన్నికల సన్నద్ధతపై చర్చించారు.

సెలవుల్లో విద్యాసంస్థలు తెలిస్తే చర్యలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలు, కళాశాలలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే అటువంటి సంస్థలపై చర్యలకు సిఫార్సు చేస్తామని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం ఒక ప్రకటనలో హెచ్చరించారు. 2024-25 విద్యా సంవత్సరంలో తరగతుల నిర్వహణ జూన్ 12వ తేదీ నుంచి ప్రారంభం కావాల్సి ఉందని తెలిపారు. పరీక్షల సాకుతో ఇంటర్, పదో తరగతిలో చేరబోయే విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. బాలల హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్న విద్యాసంస్థల గుర్తింపు రద్దుకు సిఫార్సు, అవసరమైతే పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు తమ ఫిర్యాదులను apscpcr2018@gmail.com మెయిల్‌కు పంపించాలని సూచించారు.

ముగిసిన నామినేషన్ల ఘట్టం

దాఖలు చేశారు. శ్రీకాకుళం లోక్‌సభ స్థానానికి 16 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో పది అసెంబ్లీ స్థానాలకు 129 నామినేషన్లు, లోక్‌సభకు 13 నామినేషన్లు దాఖలయ్యాయి. ప్రస్తుత ఎన్నికల్లో అత్యధికంగా పాతపట్నం అసెంబ్లీ స్థానానికి 24 మంది, అత్యల్పంగా నరసన్నపేట అసెంబ్లీ స్థానానికి 11 మంది నామినేషన్లు దాఖలు చేశారు. ఈసారి ఎన్నికల్లో ప్రధాన పార్టీలకు ఆమదాలవలస మినహా ఎక్కడా రెబల్స్ సమస్య తలెత్తలేదు. స్వతంత్ర అభ్యర్థులు కూడా తక్కువ సంఖ్యలోనే నామినేషన్లు వేశారు. నామినేషన్ల సందర్భంగా ప్రధాన పార్టీలన్నీ భారీగా జనసమీకరణ చేసి బలప్రదర్శన చేపట్టాయి. నామినేషన్ల ఘట్టం ముగియడంతో పార్టీలన్నీ పూర్తిగా ప్రచారంపై దృష్టిసారించనున్నాయి.

శ్రీకాకుళం నియోజకవర్గంలో...

శ్రీకాకుళం అసెంబ్లీ స్థానానికి మొత్తం 12 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. వారిలో ప్రధాన పార్టీల అభ్యర్థులు మంత్రి ధర్మాన ప్రసాదరావు (వైసిపి), గొండు శంకర్ (టిడిపి), అంబటి కృష్ణారావు (కాంగ్రెస్) ఉన్నారు.

నరసన్నపేట నియోజకవర్గంలో...

నరసన్నపేట అసెంబ్లీ స్థానానికి మొత్తం 11 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. వారిలో ప్రధాన పార్టీల అభ్యర్థులు ధర్మాన కృష్ణదాస్ (వైసిపి), బగ్గు రమణమూర్తి (టిడిపి), మంత్రి నర్సింహమూర్తి (కాంగ్రెస్) ఉన్నారు.

టెక్కలి నియోజకవర్గంలో...

టెక్కలి అసెంబ్లీ స్థానానికి మొత్తం 14 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. వారిలో ప్రధాన పార్టీల అభ్యర్థులు కింజరాపు అచ్చెన్నాయుడు (టిడిపి), దువ్వాడ శ్రీనివాస్ (వైసిపి), కిల్లి కృపారాణి (కాంగ్రెస్) ఉన్నారు.

పలాస నియోజకవర్గంలో...

పలాస అసెంబ్లీ స్థానానికి మొత్తం 14 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. వారిలో ప్రధాన పార్టీల అభ్యర్థులు సీదిరి అప్పలరాజు (వైసిపి), గౌతు శిరీష (టిడిపి), మజ్జి త్రినాథ్‌బాబు (కాంగ్రెస్) ఉన్నారు.

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో...

ఇచ్ఛాపురం అసెంబ్లీ స్థానానికి మొత్తం 20 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. వారిలో ప్రధాన పార్టీల అభ్యర్థులు బెందాళం అశోక్ (టిడిపి), పిరియా విజయ (వైసిపి), చక్రవర్తి రెడ్డి (కాంగ్రెస్) ఉన్నారు.

పాతపట్నం నియోజకవర్గంలో...

పాతపట్నం అసెంబ్లీ స్థానానికి మొత్తం 24 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. వారిలో ప్రధాన పార్టీల అభ్యర్థులు రెడ్డి శాంతి (వైసిపి), మామిడి గోవిందరావు (టిడిపి), కె.వెంకటరావు ఉన్నారు.

ఆమదాలవలస నియోజకవర్గంలో...

ఆమదాలవలస అసెంబ్లీ స్థానానికి మొత్తం 19 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. వారిలో ప్రధాన పార్టీల అభ్యర్థులు తమ్మినేని సీతారాం (వైసిపి), కూన రవికుమార్ (టిడిపి), సనపల అన్నాజీరావు (కాంగ్రెస్), సువ్వారి గాంధీ (ఇండిపెండెంట్, వైసిపి రెబల్) ఉన్నారు.

ఎచ్చెర్ల నియోజకవర్గంలో...

ఎచ్చెర్ల అసెంబ్లీ స్థానానికి మొత్తం 17 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. వారిలో ప్రధాన పార్టీల అభ్యర్థులు గొర్లె కిరణ్‌కుమార్ (వైసిపి), ఎన్.ఈశ్వరరావు (బిజెపి), కె.మల్లేశ్వరరావు (కాంగ్రెస్) ఉన్నారు.

ఎంపీ స్థానానికి 11 నామినేషన్లు దాఖలు

శ్రీకాకుళం ఎంపీ స్థానానికి మొత్తం 16 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. వారిలో ప్రధాన పార్టీల అభ్యర్థులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు (టిడిపి), పేరాడ తిలక్ (వైసిపి), పేడాడ పరమేశ్వరరావు (కాంగ్రెస్) ఉన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులుగా ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు పలు పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు.

మొదటి పేజీ తరువాయి

జెఇఇ మెయిన్స్‌లో సత్తా

రోటరీ నగర్‌కు చెందిన మణికంఠ విజయవాడలోని ఓ ప్రయివేట్ కళాశాలలో ఇంటర్‌లో 978 మార్కులు పొందారు. తండ్రి సురేష్‌కుమార్ శాస్త్రవేత్తగా పనిచేస్తున్నారు. తల్లి శాంతిరేఖ రాజాంలో వైద్యులుగా పనిచేస్తున్నారు. జలుమూరుకు చెందిన భేరి సాహితీ 508 ర్యాంకు దక్కించుకున్నారు. డోకులపడకు చెందిన అల్లు రాములింగం నాయుడుకు 657వ ర్యాంకు వచ్చింది. శ్రీకాకుళం నగరానికి చెందిన శిల్లా తనూజకు 815వ ర్యాంకు దక్కింది. సిరిసెల్లి సాయి వెంకటమణి భావనకు జాతీయ స్థాయిలో 1740వ ర్యాంకు, ఒబిసి కోటాలో 301 వ ర్యాంకు వచ్చింది.

కాంగ్రెస్‌తోనే ప్రత్యేక హోదా

పార్టీల్లో దేనికి ఓటు వేసినా అది బిజెపికి వేసినట్లేనని తెలిపారు. విభజన హామీలు అమలు కాకుంటే రాష్ట్రాభివృద్ధి సాధ్యం కాదని స్పష్టం చేశారు. పదేళ్ల బిజెపి పాలన దేశాన్ని మూడు దశాబ్దాలు వెనక్కి నెట్టిందని విమర్శించారు. మతం పేరిట చిచ్చు పెడుతోందన్నారు. కాంగ్రెస్ హయాంలో నెలకొల్పిన ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్లకు కట్టబెడుతోందని విమర్శించారు. 25 ఎంపీ సీట్లు ఇస్తే కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తీసుకొస్తానన్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మోడీ ముందు మోకరిల్లారని ధ్వజమెత్తారు. స్వప్రయోజనాల కోసం రాష్ట్రాన్ని తాకట్టు పెట్టారని విమర్శించారు. రాష్ట్రంలో మద్య నిషేధం అమలు చేస్తానని గత ఎన్నికల్లో హామీనిచ్చిన జగన్, రాష్ట్రంలో మద్యాన్ని ఏరులై పారించారన్నారు. నాశిరకం మద్యంతో వందల సంఖ్యలో మృత్యువాత పడ్డారని ఆరోపించారు. పలు నిబంధనలతో సంక్షేమ పథకాలకు అర్హుల సంఖ్యను కుదించారని తెలిపారు. తాను కేంద్రమంత్రిగా ఉన్న సమయంలోనే టెక్కలి అభివృద్ధి జరిగిందని కృపారాణి చెప్పారు. టెక్కలి, సంతబొమ్మాళి మండలాల పరిధిలోని సుమారు 92 గ్రామాలకు తాగునీటిని ప్రాజెక్టుని మంజూరు చేస్తే, టిడిపి ప్రభుత్వం ఒక్క పంచాయతీకి మాత్రమే పరిమితం చేసిందన్నారు. సంతబొమ్మాళి మండలంలో సుమారు 80 రకాల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తే, తెలుగుదేశం ప్రభుత్వం వాటిని శిథిలం చేసిందని చెప్పారు. తన హయాంలో నిధులు మంజూరై శంకుస్థాపనలు చేస్తే, టిడిపి తన ఖాతాలో వేసుకుందన్నారు. ఇండియా ఫోరం అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. సిపిఎం నాయకులు ఎన్.షణ్ముఖరావు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతోందని విమర్శించారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపితో జట్టు కట్టిన పార్టీలకు ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, కాంగ్రెస్ నాయకులు కిల్లి రామ్మోహనరావు, టి.బి.జి గుప్తా, సిపిఎం నాయకులు హనుమంతు ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ ఫలితాలు విడుదల

కల్పించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు తెలిపారు. సప్లిమెంటరీ పరీక్షలు జూన్ ఒకటి నుంచి ఎనిమిదో తేదీ వరకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు జూన్ పది నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఫెయిల్ అయిన పదో తరగతి విద్యార్థులు సబ్జెక్టుకు రూ.వంద, ఇంటర్‌కు రూ.150, ప్రాక్టికల్స్ సబ్జెక్టుకు రూ.వంద చొప్పున ఈనెల 29 నుంచి మే నాలుగో తేదీ వరకు చెల్లించాలన్నారు. రూ.25 అపరాధ రుసుముతో ఆరో తేదీ వరకు, రూ.50 అపరాధ రుసుముతో ఎనిమిదో తేదీ వరకు చెల్లించాలని చెప్పారు.

ఓటు హక్కు వజ్రాయుధం

కమ్యూనికేషన్ విభాగం సంయుక్తంగా వర్సిటీ హాల్‌లో గురువారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మేధావులు, విద్యావంతులు, విద్యార్థులు దేశంలో ఓటింగ్ శాతం పెరిగేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సిబిసి) అదనపు డైరెక్టర్ జనరల్ రాజేంద్ర చౌదరి మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద ఎన్నికల ప్రక్రియ భారత్‌లోనే జరుగుతోందన్నారు. అందులో పాల్గొనే అవకాశాన్ని జారవిడుచుకోవద్దని కోరారు. 18-29 ఏళ్ల మధ్యలో 30 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని, వారంతా ఓటింగ్‌లో పాల్గొనాలని కోరారు. యువత నిరాశ వీడి దేశ భవిష్యత్ కోసం ఓటు వినియోగానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సభాధ్యక్షులు, జిల్లా క్షేత్ర ప్రచార అధికారి బి.తారక ప్రసాద్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఓటింగ్ శాతం భారీగా పెంచేందుకు ఎన్నికల సంఘం పలు కార్యక్రమాలు చేపడుతుందన్నారు.

అంతకుముందు ఓటు హక్కు సద్వినియోగంపై వర్సిటీలో ర్యాలీ నిర్వహించారు. ఓటు విద్య- ఎన్నికల వ్యవస్థలో భాగస్వామ్యంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు కళాశాలల వారీగా బహుమతులు ప్రదానం చేశారు. ఓటు హక్కు అవశ్యకతపై ప్రతిజ్ఞ చేయించారు. ఓటు హక్కు వినియోగంపై పొందూరు మండలం గోకర్ణపల్లికి చెందిన శ్రీ చక్రపాణి కళా బృందం సభ్యులు ప్రదర్శించిన జానపద గేయాలు, నృత్యాలు సభికులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ పి.సుజాత, జర్నలిజం విభాగం అధ్యాపకులు ఆర్.తిరుపతిరావు, జి.లీలావరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉల్లంఘనలపై ఫిర్యాదు చేయండి

ఆమదాలవలస, నరసన్నపేట అసెంబ్లీ నియోజకవర్గాలకు సైతం కంట్రోల్‌రూమ్ ద్వారా పరిష్కారం దొరకని ఫిర్యాదులు ఉంటే నేరుగా ఆయనకే ఫోన్ ద్వారా తెలియజేయవచ్చని తెలిపారు. శ్రీకాకుళం పార్లమెంట్ స్థానానికి సంబంధించి అభ్యర్థుల ఖర్చు విషయంలో ఏమైనా అభ్యంతరాలు, ఫిర్యాదులు ఉంటే ఐఆర్ఎస్ అధికారి కె.కె శరవణ కుమార్‌కు చెందిన 8121646161 ఫోన్ నంబరును సంప్రదించవచ్చన్నారు.

ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, పాతపట్నం నియోజకవర్గాల సాధారణ పరిశీలకులు, ఐఎఎస్ అధికారి సందీప్ కుమార్ ఫోన్ నంబరు 9032423131కు ఫిర్యాదులు తెలియజేయవచ్చని చెప్పారు. ఇవే నియోజకవర్గాల్లో ఎన్నికల వ్యయానికి సంబంధించిన ఫిర్యాదులు ఉంటే ఐఆర్ఎస్ అధికారి నవీన్ కుమార్ సోనీ ఫోన్ నంబరు 9030096161కు ఫిర్యాదు చేయొచ్చని తెలిపారు. ఎచ్చెర్ల నియోజకవర్గానికి సంబంధించిన సాధారణ ఎన్నికల ఫిర్యాదుల కోసం ఐఎఎస్ అధికారి తలత్ పర్వేజ్ ఇక్బాల్ ఫోన్ నంబరు 9030983131కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయొచ్చని చెప్పారు.

చంద్రబాబుకు పరాభవం తప్పదు

ఉత్తరాంధ్రలో జగన్మోహన్ రెడ్డి చేసిన అభివృద్ధి ఏమిటని చంద్రబాబు ప్రశ్నిస్తున్నారని, పలాసలో మంచినీటి పథకం, కిడ్నీ రీసెర్చ్ సెంటర్, మూలపేట పోర్టు ఇలా పలు పథకాలతో జిల్లాను అభివృద్ధి చేసింది వైసిపి ప్రభుత్వమేనన్నారు. 2014 ఎన్నికల్లో 612 హామీలు ఇచ్చి, ఎన్ని హామీలు అమలు చేశారో టిడిపి నాయకులు చెప్పాలన్నారు. జగన్మోహన్ రెడ్డి కుటుంబంలో చిచ్చు పెట్టిన ఘనత కూడా చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు. గూగుల్‌లో ఇసుక డాన్ అని సెర్చ్ చేస్తే కూన రవికుమార్ పేరు చూపిస్తుందని, 2014 నుంచి 2019 వరకు నియోజకవర్గంలో సాగిన ఇసుక దందా ప్రజలకు తెలుసునన్నారు. ప్రకృతి కూడా కన్నెర్ర చేసి వరద రూపంలో లారీలను ముంచిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాల నియామకాలు, బదిలీల్లో తాను లంచాలు తీసుకున్నానని ఆరోపించిన రవికుమార్ నిరూపించాలని సవాల్ విసిరారు. టిడిపికి వచ్చే ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ధి చెప్పారన్నారు. సమావేశంలో వైసిపి నాయకులు తమ్మినేని చిరంజీవి నాగ్, దుంపల శ్యామ్, పొడుగు శ్రీనివాసరావు, బొడ్డేపల్లి రాజు పాల్గొన్నారు.

జగన్ బస్సు యాత్ర విజయవంతం

శ్రీకాకుళం : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జిల్లాలో బుధవారం నిర్వహించిన మేమంతా సిద్ధం బస్సు యాత్రను విజయవంతమైందని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ ఒక ప్రకటనలో తెలిపారు. బస్సు యాత్రను విజయవంతం చేసిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. మండుటెండలను సైతం లెక్క చేయకుండా జగన్ పర్యటనను జయప్రదం చేశారని తెలిపారు. వైసిపిలోని అన్ని విభాగాల ప్రతినిధులు ఇందులో చురుగ్గా పాల్గొన్నారని తెలిపారు. ఇదే స్ఫూర్తితో ఈ ఎన్నికల్లో పార్టీ ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు.

'సూపర్ సిక్స్'పై విస్తృత ప్రచారం

పొందూరు : ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు

ఆమదాలవలస : ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి- పొందూరు

మండలం రాపాక పంచాయతీ ఇల్లయ్యగారిపేట, వావిలపల్లిపేటలో టిడిపి జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గం టిడిపి అభ్యర్థి కూన రవికుమార్ సతీమణి, మాజీ ఎంపిపి కూన ప్రమీల గురువారం సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేయనున్న పలు పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కూన వెంకట సత్యనారాయణ, తెలుగు యువత జిల్లా కార్యదర్శి బలగ శంకర భాస్కరరావు, ఎంపిటిసి బాడాన హరిక, మండల తెలుగు యువత కార్యదర్శి కండాపు శ్రీనివాసరావు, మండల ఉపాధ్యక్షుడు బాడాన శేషగిరి, నాయకులు పైడి రామారావు, కోటీశ్వరరావు, రామారావు పాల్గొన్నారు.

బూర్జ: మండలంలో చిన్న లంకాం, వావాంలో టిడిపి మండల అధ్యక్షులు వి. సీతారాం బాబు నాయుడు ఆధ్వర్యంలో గురువారం సూపర్ సిక్స్ పథకాలను ఇంటింటికి వెళ్లి వివరించారు. కార్యక్రమంలో మొదలవలస రమేష్, అంపిలి గణపతిరావు, కొరికాన వెంకట సీతారామరాజు, బుల్లిబాబు, లంక జనార్ధన్, ఆనందరావు, కడగల కృష్ణ, దాసిరెడ్డి వెంకునాయుడు, మజ్జి వాసుదేవరావు, గోపి పాల్గొన్నారు

ఆమదాలవలస: టిడిపితోనే సంక్షేమ పథకాలు సాధ్యమని జిల్లా తెలుగు మహిళ అధ్యక్షులు మెట్ట సుజాత, తమ్మినేని చంద్రశేఖర్, నూక రాజు అన్నారు. మండలంలోని చిట్టివలస, జొన్నవలస, ఆర్ఆర్ కాలనీలో ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

బూర్జ: ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

సరుబుజ్జిలి : సూపర్ సిక్స్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సూర్యం

కార్యక్రమంలో టిడిపి నాయకులు తమ్మినేని సుజాత, అన్నెపు భాస్కరరావు, గుజ్జల లక్ష్మణరావు, బాలి లక్ష్మణరావు, నవిరి చిన్నారావు, కూన రమేష్ పాల్గొన్నారు.

సరుబుజ్జిలి: టిడిపితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివ్వాల సూర్యం అన్నారు. మండలంలోని రొట్టవలసలో ఇంటింటికి వెళ్లి పోస్టర్లు పంపిణీ చేస్తూ సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు అంబళ్ల రాంబాబు, తాడేల వెంకటరమణ, లావేటి పూర్ణారావు, మీసాల రామారావు పాల్గొన్నారు.

బోల్తా పడిన ఆటో (ఇన్‌సెట్‌లో అచ్చప్పడు (ఫైల్)

ఆటో బోల్తా : డ్రైవర్ మృతి

ప్రజాశక్తి- ఎచ్చెర్ల, పొందూరు

మండలంలోని చిలకపాలెం సమీపంలో జాతీయ రహదారిపై గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మజ్జి అచ్చప్పడు (48) గాయపడి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. పొందూరు మండలం లోలుగుకు చెందిన ఆటో డ్రైవర్ అచ్చప్పడు ప్రతిరోజూ శ్రీకాకుళం నుంచి కూరగాయలు తీసుకొని రణస్థలం చేరవేస్తుంటారు. అదే పనిలో గురువారం కూడా శ్రీకాకుళం నుంచి కూరగాయలు తీసుకొని వెళ్తుండగా వెనుక నుంచి వ్యాన్ ఢీకొనడంతో అదుపు తప్పి ఆటో బోల్తాపడింది. దీంతో అచ్చప్పడు తీవ్రంగా గాయపడగా అదే గ్రామానికి చెందిన సింహాచలంకు స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అచ్చప్పడును శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా అప్పటికే అచ్చప్పడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈయనకు భార్య గౌరీశ్వరి, కుమారుడు సునీల్, కుమార్తె భార్గవి ఉన్నారు. ఎస్ఐ చిరంజీవి ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అచ్చెప్పడు మరణించడంతో లోలుగులో విషాదఛాయలు అలము కున్నాయి. కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

రాష్ట్రీయ బాల పురస్కార్‌కు దరఖాస్తులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కేంద్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, సాంస్కృతిక, కళలు, క్రీడలు, సమాజసేవ, పాండిత్యం, సాహస రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనపర్చిన బాలలకు ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్-2025 అందజేయనున్నట్లు ఐసిడిఎస్ పిడి శాంతిశ్రీ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ పురస్కారాలు పొందడానికి అర్హులైన బాలల నుంచి నామినేషన్లను కోరుతున్నట్లు తెలిపారు. అర్హులైన వారు https://awards.gov.in ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు పంపాలన్నారు. ఈ ఏడాది జూలై 31 నాటికి 18 ఏళ్లలోపు వారు ఈ దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైన బాలలకు భారత రాష్ట్రపతి చేతులమీదుగా పతకం, రూ.లక్ష నగదు, ధ్రువపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. అర్హులైన వారు దరఖాస్తులు పంపాలని ఆమె సూచించారు.

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని

'ఉపాధి'కి అండగా ఉంటా

ప్రజాశక్తి- బూర్జ

ఎండనక వాననక కష్టపడి పనిచేస్తున్న ఉపాధి హామీ పథకం కూలీలకు తాను అండగా ఉంటానని స్పీకర్ తమ్మినేని సీతారాం హామీఇచ్చారు. గురువారం మండలంలోని కొల్లివలసలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న అనంతరం తిరిగి వస్తున్న సమయంలో ఉప్పినివలసలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలతో మాట్లాడారు. ఉపాధి కూలీలకు అన్ని విధాలుగా ఆదుకునేందుకు తమ ప్రభుత్వం ఎప్పుడు ముందుంటుందన్నారు. కూలీలకు పనికి తగ్గ వేతనం అందించేందుకు వీలుగా రోజు వారీ కూలీ పెంచడం జరిగిందన్నారు. అంతే కాకుండా తిరిగి తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వారికి అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

కోటబొమ్మాళి : మండలంలోని చీపుర్లపాడు పంచాయతీ దుర్గమ్మ పేటకు చెందిన సిహెచ్. శ్రీనివాసరావు (18) గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. శ్రీనివాసరావు కోట బొమ్మాళి నుంచి తన స్వగ్రామానికి బైక్‌పై వెళ్తున్నాడు. సీతన్నపేట వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొంది. ప్రమాదంలో శ్రీనివాస రావు తీవ్రంగా గాయపడడంతో స్థానికులు ఆటోలో స్థానిక సామాజిక ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందారు. మృతుడు శ్రీనివాసరావు ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించారు. మృతుడికి తల్లిదండ్రులు నర్సమ్మ, ఎర్రన్న ఉన్నారు. కుమారుడు మృతి చెందడంతో తల్లి దండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మృతుడు శ్రీనివాసరావు

కిరణ్ కుమార్ విస్తృత ప్రచారం

ప్రజాశక్తి- లావేరు

ఎచ్చెర్ల నియోజకవర్గ ప్రజలకు సేవ చేసేందుకు మరో అవకాశం కల్పించాలని, నా జీవితాన్ని ప్రజాసేవకు అంకితం చేస్తానని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. గురువారం గుమ్మడం పంచాయతీ బుడతవలస పంచాయతీల్లోని గ్రామాల్లో ఎన్నికలు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రజారంజక పాలన చేస్తున్నారని, ప్రజలు మరో చాన్స్ ఇవ్వాలని కోరారు. సంక్షేమం, అభివృద్ధి జగన్మోహన్ రెడ్డి తోనే సాధ్యమన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి ఆర్.బాలకృష్ణ, జెడ్‌పిటిసి ఎం.సీతంనాయుడు, జెసిఎస్ ఇన్‌ఛార్జి మీసాల శ్రీనివాసరావు, సర్పంచ్ ధర్మారావు, ఎంపిటిసి జగ్గురోతు తవిటినాయుడు, ముప్పిడి శ్రీరాములు, నాగం కనకరాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నామినేషన్ పత్రాలు అందజేస్తున్న రామ్‌మనోహర్ నాయుడు

తండ్రి తరుపున నామినేషన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం నియోజక వర్గం అభ్యర్థిగా మంత్రి ధర్మాన ప్రసాదరావు తరుపున ఆయన కుమారుడు ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు గురువారం నామినేషన్ దాఖలు చేశారు. కలెక్టరేట్ ఆవరణలో ఆర్‌డిఒ కార్యాలయంలో ఉన్న శ్రీకాకుళం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి సిహెచ్ రంగయ్యను కలిసి నామినేషన్ పత్రాలను అందజేశారు.

పలువురు నామినేషన్ల దాఖలు

ప్రజాశక్తి- రణస్థలం

ఎచ్చెర్ల నియోజకవర్గం అసెంబ్లీ స్థానానికి బిజెపి, టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా నడుకుదిటి ఈశ్వరరావు నామినేషన్ దాఖలు చేశారు. అలాగే డమ్మీ అభ్యర్థి ఎన్ఇఆర్ భార్య రజనీ నామినేషన్ దాఖలు చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్.వి.లక్ష్మణమూర్తికి నామినేషన్ పత్రాలను అందజేశారు. అలాగే ఇండిపెండెంట్ అభ్యర్థిగా రణస్థలం మండలం పైడిపేటకు చెందిన పైడి శ్రీనువాస రావు, డమ్మీ అభ్యర్థిగా పైడి శ్రీనువాసరావు భార్య సుజాత నామినేషన్ దాఖలు చేశారు. రణస్థలం మండలానికి చెందిన గొర్లె రాంబాబు ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ వేశారు.

టిడిపిలో 80 కుటుంబాలు చేరిక

పార్టీలో చేరిన వారితో రవికుమార్

ఆమదాలవలస: నియోజకవర్గంలోని బూర్జ మండలం అయ్యవారిపేట పంచాయతీకి చెందిన ఉప సర్పంచ్ కొత్తకోట రామినాయుడుతో పాటు మరో 80 కుటుంబాలు గురువారం వైసిపి నుంచి టిడిపిలో చేరారు. ఆమదాలవలస ఎమ్మెల్యే అభ్యర్థి కూన రవికుమార్ ఇంటి వద్ద నిర్వహించిన కార్యక్రమంలో వీరందరికీ రవికుమార్ టిడిపి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ రామినాయుడు మాట్లాడుతూ వైసిపి ఐదేళ్ల పాలనలో గ్రామ పంచాయతీల నిధులను మళ్లింపుతో పాటు గ్రామాల అభివృద్ధికి ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. అయ్యవారిపేట సర్పంచ్ ఇప్పిలి అంబుజాక్షి, సిమ్మన్న తమ అనుచరులతో టిడిపిలో చేరారని, అందుకే గ్రామమంతా రవికుమార్‌కు మద్దతు పలకాలన్న ఉద్దేశంతో టిడిపిలో చేరినట్లు తెలిపారు.

ఆమదాలవలసలో 31 నామినేషన్లు

ఆమదాలవలస: నియోజకవర్గంలో మే 13న నిర్వహించనున్న అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి 31 నామినేషన్లు నమోదైనట్లు రిటర్నింగ్ అధికారి ఎం.నవీన్ తెలిపారు. గురువారం తహశీల్దార్ కార్యాలయంలో వైసిపి తరుపున తమ్మినేని వాణిశ్రీ, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ తరుపున సనపల సుజాత, గురువు రేవతి జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ, ఇండిపెండెంట్ అభ్యర్థిగా లోలుగు వెంకట రాజశేఖర్, ఇండిపెండెంట్ అభ్యర్థిగా ముద్దాడ రాంబుజ్జి నామినేషన్లను రిటర్నింగ్ అధికారి ఎం.నవీన్‌కు అందజేశారు. గురువారం ఐదుగురు వ్యక్తులు వివిధ పార్టీలకు చెందిన వారు నామినేషన్లు వేశారు. ఈనెల 18 నుంచి 25 వరకు నిర్వహించిన నామినేషన్ల కార్యక్రమంలో అభ్యర్థులు వేసిన నామినేషన్లన్నీ 26న శుక్రవారం పరిశీలన చేయడం జరుగుతుందన్నారు. 27 నుంచి 29 వరకు నామినేషన్ల ఉపసంహరణ నిర్వహించబడుతుందని ఆయన తెలిపారు.

పెట్రోల్ బంకుకు నిప్పు

వజ్రపుకొత్తూరు: మండలంలోని పూండి గూనాలపాడు పెట్రోల్ బంకుకు బుధవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు నిప్పు అంటించారు. రెండు నెలల్లో ఇదే పెట్రోల్ బంకుకు నిప్పు పెట్టే ఘటన మూడోది కావడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోల్ పంపింగ్ మోనిటర్ బాక్స్‌లో పెట్రోల్ పోసి నిప్పు అంటించడంతో మోనిటర్ పూర్తిగా దగ్ధమైంది. బంకు యజమాని కొర్ల దేవిమహాలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి మోటార్ సైకిల్‌పై వచ్చి పెట్రోల్ మోనిటర్‌ను కాల్చి వేయగా, ఆ విషయాన్ని స్థానికులు వచ్చి చూసే సరికి దుండగుడు పరుగులు తీశారు. అక్కడే పార్క్ చేసిన ద్విచక్ర వాహనాన్ని పోలీసులకు అప్పగించారు. ఎస్ఐ సిహెచ్.రామారావు, పోలీసు సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని సిసి పుటేజ్‌ను పరిశీలించారు. క్లూస్ టీమ్‌కు సమాచారం ఇవ్వడంతో వారు అనువణువు పరిశీలించి వేలి ముద్రలు సేకరించారు కేసు నమో దు చేసి సిసి పుటేజ్ ఆధారంగా దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.

పరిశీలిస్తున్న ఎస్ఐ రామారావు

అవినీతి లేని పాలన అందిస్తా

వైసిపి అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసిపికి ఓటు వేసి ఒక అవకాశం ఇచ్చి గెలిపిస్తే అవినీతి లేని పాలన అందిస్తానని ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని తలగాం, తేలినీలపురం, రావివలస, తోలుసూరుపల్లి పంచాయతీల్లో గురువారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసిపితోనే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని అన్నారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు పేరాడ రమేష్, మన్నెల కిషోర్, సర్పంచ్‌లు హనుమంతు వెంకటేశ్వరరావు, సర్లాన బాలకృష్ణ, బగాది రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న దువ్వాడ శ్రీనివాస్

పెసరపాడులో ప్రచారం చేస్తున్న గౌతు శిరీష

జీడికి మద్దతు ధర ప్రకటిస్తాం

టిడిపి అభ్యర్థి గౌతు శిరీష

ప్రజాశక్తి- పలాస

ఉద్దాన ప్రాంతంలో సాగు చేస్తున్న జీడి పంటకు మద్దతు ధర ప్రకటించి పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల మధ్యలో జీడి, కొబ్బరి బోర్డును ఏర్పాటు చేస్తామని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గౌతు శిరీషా హామీ ఇచ్చారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి పెసరపాడు, అంతరకుడ్డ గ్రామాల్లో గురువారం ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఈ మేరకు టిడిపి సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదేళ్ల కాలంలో వంశధార సాగునీరు పలాస, వజ్రపుకొత్తూరు మండలాలకు మంత్రి అప్పలరాజు అందించలేకపోయారన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే శివారు భూములకు సకాలంలో సాగునీరు అందిస్తామన్నారు. వైసిపి పాలనలో వ్యాపారులకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో కొండలు, గుంటలు దోచుకోవడంపై ఉన్న శ్రద్ధ ఉద్దాన ప్రాంతంలో పట్టిపీడిస్తున్న ఎలుగు దాడుల నివారణపై శ్రద్ధ చూపడం లేదన్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, ఎంపీ రామ్మోహనాయుడుకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావు, దువ్వాడ శ్రీకాంత్, గురిటి సూర్యనారాయణ, దువ్వాడ హేంబాబుచౌదరి, గాలి కృష్ణారావు, బడ్డ నాగరాజు, మాజీ కౌన్సిలర్ సంపతిరావు ధనుంజయ, సవర రాంబాబు, పైల చక్రధర్, అట్టాడ వాసు పాల్గొన్నారు.

వైసిపి కండువా వేస్తున్న రెడ్డి శాంతి

శాంతి సమక్షంలో వైసిపిలో చేరికలు

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని గురండి పంచాయతీ దాసరదీరానికి చెందిన మాజీ సర్పంచ్ పాసర్ల భయ్యన్న, ఢిల్లీశ్వరరావు, గేదెల సంజీవరావుతో పాటు పలువురు గురువారం వైసిపిలో చేరారు. వీరికి ఎమ్మెల్యే రెడ్డి శాంతి వైసిపి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి విజయానికి అందరూ కలిసికట్టుగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి భారీ వైసిలోకి చేరుతున్నారని అన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల పార్టీ అధ్యక్షులు సారిపల్లి ప్రసాదరావు, పిఎసిఎస్ అధ్యక్షులు చింతాడ సూర్యనారాయణ, సర్పంచ్ బోర సింహాద్రినాయుడు, కలమట రమేష్, గోగుల వరప్రసాదరావు నాయుడు, మొజ్జడ చక్రపాణి, జి.ఆనందరావు, జి.వాసు, బి.శ్రీను, కె.రామకృష్ణ పాల్గొన్నారు.

ఎచ్చెర్ల నియోజకవర్గానికి రాజెవరో?

శ్రీకాకుళం జిల్లాలోని మరో కీలక నియోజకవర్గం ఎచ్చెర్ల సార్వత్రిక ఎన్నికలు ఇక్కడ 12 సార్లు ఎన్నికలు జరిగాయి. పరిశ్రమల ఖిల్లాగా పేరుగాంచిన ఈ నియోజకవర్గంలో గెలుపు ఎప్పుడూ ప్రధాన పార్టీలకు అత్యంత ప్రతిష్టాత్మకం. ఈ నియోజకవర్గంలో పురుషులు, మహిళలు కలిపి 2,43,056 మంది ఓటర్లు ఉన్నారు. ఈ నియోజకవర్గం ఏర్పాటైన దగ్గర నుంచి ఇప్పటి వరకు టిడిపి ఆరుసార్లు విజయం సాధించగా, కాంగ్రెస్ అభ్యర్థులు మూడుసార్లు, ఇండిపెండెంట్, జనతా పార్టీ, వైసిపి అభ్యర్థులు చెరొకసారి గెలిచారు. ప్రస్తుతం ఇక్కడ ఎమ్మెల్యేగా వైసిపికి చెందిన గొర్లె కిరణ్ కుమార్ వ్యవహరిస్తున్నారు.

- **2,43,056 మంది ఓటర్లు**
- **తూర్పుకాపులే అధికం**

ప్రజాశక్తి- రణస్థలం

ఈ సారి ఎన్నికల్లో మూడు ప్రధాన పార్టీల నుంచి అభ్యర్థులు తలపడుతున్నారు. వీరంతా రణస్థలం మండలానికి చెందినవారే. జాతీయ రహదారి పొడవునా విస్తరించిన ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజకవర్గం జిల్లాకే ముఖద్వారంగా స్వాగతం పలుకుతోంది. 1967లో ఈ నియోజకవర్గం ఏర్పాటైన నాటి నుంచి ఇప్పటి వరకు సార్వత్రిక ఎన్నికలు 12 సార్లు జరిగాయి. 1978 నుంచి 2004 వరకు ఎచ్చెర్ల సెగ్మెంట్ ఎస్‌సిలకు రిజర్వ్ కాబడింది. 2009లో జరిగిన నియోజకవర్గ పునర్విభజనలో ఎచ్చెర్ల జనరల్ కేటగిరీకి కేటాయించారు. అప్పటి వరకు చీపురుపల్లిలో ఉన్న జి.సిగడాం మండలాన్ని ఎచ్చెర్లలో విలీనం చేశారు. 1983లో టిడిపి ఆవిర్భావంతో ఆ పార్టీకి ఎచ్చెర్ల కంచుకోటగా మారింది. ఇప్పటి వరకు టిడిపి ఆరుసార్లు విజయం సాధించగా, కాంగ్రెస్ అభ్యర్థులు మూడుసార్లు, వైసిపి, ఇండిపెండెంట్, జనతా అభ్యర్థులు చెరొకసారి గెలిచారు. ఈసారి పోటీ ఇండియా ఫోరం అభ్యర్థి కరిమజ్జి మల్లేశ్వరరావు, సిట్టింగ్ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు అభ్యర్థుల మధ్య పోటీ ప్రధానం నెలకొంది.

కూటమిలో బిజెపికి దక్కిన సీటు

టిడిపి, జనసేన, బిజెపి పొత్తుల్లో భాగంగా కూటమి తరపున బిజెపి ఎచ్చెర్ల అసెంబ్లీ సీటును దక్కించుకుంది. ఈ సెగ్మెంట్‌లో టిడిపి ఇన్‌ఛార్జిగా ఉన్న మాజీ మంత్రి, సీనియర్ నేత కిమిడి కళావెంకటరావు చీపురుపల్లి నుంచి పోటీ చేస్తున్నారు. కాగా, ఇదే నియోజకవర్గం నుంచి టిడిపి టిక్కెట్ ఆశించిన కలిశెట్టి అప్పలనాయుడు విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్నారు.



ఓటర్ల వివరాలు

ఎచ్చెర్ల నియోజకవర్గంలో పురుషులు 1,22,223 మంది, మహిళలు 1,20,819 మంది, జెండర్ ఓటర్లు 14 మంది ఉన్నారు. నియోజకవర్గంలో తూర్పుకాపు ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. లావేరు, రణస్థలం, జి.సిగడాం మండలాల్లో కాపు సామాజిక తరగతి ప్రజలు అధిక సంఖ్యలో ఉన్నారు. ఎచ్చెర్ల మండలంలో కాళింగ, వెలమ సామాజిక తరగతి ఉన్నాయి. ఎచ్చెర్ల, రణస్థలం మండలాల్లో సుమారు 15 వేల మంది మత్స్యకార ఓటర్లు ఉన్నారు. లావేరు, జి.సిగడాం మండలాల్లో తెలగ సామాజిక తరగతి ప్రజలు ఉన్నారు.

నియోజకవర్గ చరిత్ర

ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజకవర్గం 1967లో ఏర్పాటైంది. 1967, 1972లో ఓపెన్ కేటగిరీలో ఎన్నికలు జరిగాయి. 1978 నుంచి 2004 వరకు ఎస్‌సిలకు రిజర్వ్ చేయబడింది. ఎచ్చెర్ల, లావేరు, రణస్థలం మండలాలతో ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజకవర్గం 2004 ఎన్నికల వరకు ఉండేది. 2009లో జరిగిన నియోజకవర్గ పునర్విభజనలో జి.సిగడాం మండలాన్ని ఎచ్చెర్ల అసెంబ్లీ సెగ్మెంట్‌లో కొత్తగా కలిపారు. 2009 ఎన్నికల నుంచి ఓపెన్ కేటగిరీకి ఈ నియోజకవర్గాన్ని కేటాయించారు.

ప్రతిభాభారతి ఐదుసార్లు విజయం

ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 1983 నుంచి 1999 వరకు వరుసగా ఐదుసార్లు కావలి ప్రతిభాభారతి శాసనసభ్యురాలిగా ఎన్నికయ్యారు. మంత్రిగా, అసెంబ్లీ శాసనసభ స్పీకర్‌గా ఆమె పనిచేశారు. నియోజకవర్గ పునర్విభజనలో ఎచ్చెర్ల జనరల్ కేటగిరీకి కేటాయించారు. 2009, 2014 ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చవిచూశారు. 2004 ఎన్నికల్లో ఎచ్చెర్ల నుంచి ప్రతిభాభారతి (టిడిపి)పై విజయం సాధించిన రొంగ్రు మురళీమోహన్ (కాంగ్రెస్), 2009లో రాజాం (ఎస్‌సి) నియోజకవర్గంలో ఆమె పైనే పోటీ చేసి గెలుపొందారు. 1978లో ఎన్నికల్లో ప్రతిభాభారతి పెదనాన్న కొత్తపల్లి నరసయ్య జనతా పార్టీ తరపున ఎచ్చెర్ల నుంచి పోటీచేసి శాసనసభ్యునిగా ఎన్నికయ్యారు.

రాష్ట్రంలో ఎచ్చెర్లకు ప్రత్యేక గుర్తింపు

ఎచ్చెర్ల నియోజకవర్గానికి రాష్ట్రస్థాయి గుర్తింపు ఉంది. ఇక్కడి శాసనసభ్యులుగా ప్రాతినిధ్యం వహించిన నేతలు మంత్రి పదవులతో పాటు, శాసనసభ స్పీకర్, పార్టీలో కీలక పదవులు చేపట్టడంతో ఎచ్చెర్లకు మంచి గుర్తింపు లభించింది. రణభూమిగా పేరొందిన రణస్థలం ఇదే నియోజకవర్గంలోనే ఉంది. బొబ్బిలి రాజులు, విజయనగరం రాజులు యుద్ధానికి ప్రధాన కేంద్రంగా అప్పట్లో రణస్థలం వర్ధిల్లిందని చరిత్ర చెబుతోంది. ఎచ్చెర్ల మండలం ఎస్.ఎం.పురం మహమ్మదీయుల కాలంలో ప్రధాన కేంద్రంగా ఉండేది. పారిశ్రామికవాడ, విద్యా కేంద్రంగా భాసిల్లుతోంది. జిల్లా కేంద్రంలోకి అడుగుపెట్టగానే స్వాగతించే ఎచ్చెర్ల నియోజకవర్గానికి ఇంకెన్నో ప్రత్యేకతలు ఉన్నాయి.

ఈ సారి అభ్యర్థులంతా రణస్థలం వారే

ఈ ఎన్నికల్లో చిత్ర విచిత్రాలు చోటుచేసుకుంటున్నాయి. వైసిపి, టిడిపి, జనసేన, బిజెపి కూటమి కట్టాయి. మరోవైపు కాంగ్రెస్ పార్టీ సైతం క్రియాశీలకంగా మారింది. వామపక్షాలతో కలిసి ఇండియా ఫోరం తరుపున పోటీచేస్తోంది. ఇప్పటికే అభ్యర్థుల నామినేషన్లు దాఖలు చేశారు. అయితే ఎచ్చెర్ల నియోజకవర్గం మాత్రం ఎన్నో ప్రత్యేకతలకు వేదికగా మారుతోంది. ఎచ్చెర్ల నియోజకవర్గం శ్రీకాకుళం జిల్లాలో ఉంది. కానీ, విజయనగరం లోక్‌సభ స్థానం పరిధిలో కొనసాగుతోంది. పొత్తులో భాగంగా ఈ అసెంబ్లీ స్థానం బిజెపికి కేటాయించగా, ఆ పార్టీ నుంచి నడుకుదిటి ఈశ్వరరావును నామినేషన్ దాఖలు చేశారు. ఆయన సొంత గ్రామం రణస్థలం మండలం బంటుపల్లి పంచాయతీ నడుకుదిటిపాలెం. అటు విజయనగరం పార్లమెంట్ స్థానానికి సంబంధించి టిడిపి అభ్యర్థిగా కలిశెట్టి అప్పలనాయుడు ఈయన స్వగ్రామం రణస్థలం మండలంలోని వి.ఎన్.పురం. వైసిపి అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పోటీ చేస్తున్నారు. ఈయన స్వగ్రామం రణస్థలం మండలంలోని పాతర్లపల్లి. కాంగ్రెస్ అభ్యర్థిగా కరిమజ్జి మల్లేశ్వరరావు నామినేషన్ దాఖలు చేశారు. ఈయన స్వగ్రామం మండలంలోని నగరప్పాలెం. దీంతో అన్ని ప్రధాన పార్టీలు రణస్థలం మండలానికి ప్రాధాన్యం ఇచ్చాయి. పేరుకే ఎచ్చెర్ల నియోజకవర్గం కానీ.. రాజకీయ కార్యకలాపాలు నడిచేది రణస్థలం నుంచే. ఎన్నెన్నో యుద్ధగాథలతో ప్రాచుర్యంలోకి వచ్చిన రణస్థలం నిజంగానే రాజకీయాలకు 'రణ'స్థలిగా మారడం విశేషం. ఏడాది కిందట జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ యువగళం పేరిట రణస్థలం నుంచే వైసిపి ప్రభుత్వంపై పోరాటం ప్రారంభించిన సంగతి తెలిసిందే. అప్పట్లో రాష్ట్రం చూపు రణస్థలంపై పడింది. ఇప్పుడు అన్ని రాజకీయ పార్టీలు రణస్థలానికి ప్రాధాన్యమివ్వడంతో మరోసారి రణస్థలం పేరు మార్మోగిపోతోంది.

ఎచ్చెర్ల నేతలు పక్క జిల్లాకు

ఎచ్చెర్ల నియోజకవర్గానికి చెందిన నేతలు పొత్తుల నేపథ్యంలో పక్క జిల్లాలో పోటీకి దిగుతున్నారు. రణస్థలం మండలానికి చెందిన టిడిపి నాయకుడు, పొందూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కలిశెట్టి అప్పలనాయుడును విజయనగరం పార్లమెంట్ అభ్యర్థిగా బరిలో ఉన్నారు. ఈయన ఎచ్చెర్ల నియోజకవర్గ అసెంబ్లీ సీటును ఆశించారు. అయితే, పొత్తుల కారణంగా బిజెపికి ఎచ్చెర్ల సీటును కేటాయించారు. ఇక్కడ నుంచి విజయనగరం జిల్లా బిజెపి అధ్యక్షుడు నడుకుదిటి ఈశ్వరరావు బిజెపి నుంచి బరిలో ఉన్నారు. దీంతో విజయనగరం పార్లమెంట్ అభ్యర్థిగా కలిశెట్టిని అధిష్టానం ఖరారు చేయడంతో నామినేషన్ దాఖలు చేశారు. అలాగే టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి కిమిడి కళావెంకటరావు కూడా ఎచ్చెర్ల నియోజకవర్గం నుంచే పోటీ చేసేందుకు ఆసక్తి చూపారు. అయితే ఆయన సీనియర్ నేత కావడంతో చీపురుపల్లిలో మంత్రి బొత్సపై పోటీకి నిలబెట్టారు. ఎచ్చెర్లకు చెందిన కలిశెట్టి అప్పలనాయుడు, కిమిడి కళావెంకటరావు పక్క జిల్లాలో పోటీకి దిగుతుండడంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

మరోసారి అవకాశం ఇవ్వాలి

ప్రజాశక్తి- పలాస

మరోమారు తనకు ఎమ్మెల్యేగా గెలిపిస్తే పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీని మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 14,16,4వ వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారాన్ని గురువారం నిర్వహించారు. ముందుగా అప్పలరాజుకు ప్రజలు బ్రహ్మరథం పడుతూ మహిళలు హారతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని కెటి రోడ్ 80 అడుగుల రోడ్డుగా చేసుకోవడంతో ఎంతో మంది కొత్త వ్యాపారులు పట్టణానికి వస్తున్నారని అన్నారు. దీంతో ఎంతో మందికి ఉపాధి అవకాశాలు కలుగుతున్నాయని అన్నారు. ఇప్పటికే ఇటువంటి అభివృద్ధి పనులు ఎన్నో చేశానని అన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్లు సురేష్‌బాబు, బోర బుజ్జి హనుమంతు వెంకటరావు, కౌన్సిలర్లు బెల్లాల శ్రీను, వైసిపి నాయకులు బల్లయ్య. రోణంకి శాంతికుమారి, దున్న సత్యం, పిచుక అజయ్, బోనెల రాము, బమ్మిడి సంతోష్, సనపల సింహాచలం, యుగంధర్, డబ్బీరు భవాని పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న అప్పలరాజు

మామిడి గోవిందరావు ప్రచారం

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని వెంకటాపురం, మాదనపురం, సోమరాజపురం గ్రామాల్లో గురువారం పాతపట్నం నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి మామిడి గోవిందరావు గురువారం ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి టిడిపి అమలు చేయనున్న సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను, ఎంపీ అభ్యర్థి కె.రామ్మోహన్ నాయుడులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు అగతముడి అరుణ్‌కుమార్, ఎ.మాధవరావు, సరేశ్వరరావు, వై.దాస్‌నాయుడు, కమలాకర్, గెడ్డవలస ముగితి కృష్ణారావు పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న గోవిందరావు

ఆదరణలో లోటు లేదు... మరి ఓటు ఎవరికో?

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

సార్వత్రిక ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న కొద్దీ పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో ఒకటే టెన్షన్. రానున్న ఎన్నికల్లో ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు ఖరారైన వెంటనే నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ప్రధాన రాజకీయ పార్టీలైన వైసిపి నుంచి పిరియా విజయా, టిడిపి ఉమ్మడి అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే బెందాళం అశోక్, ఇండియా ఫోరం అభ్యర్థి మాసుపత్రి చక్రవర్తిరెడ్డిలు పోటీ పడుతున్నారు. ముగ్గురూ ప్రచారం ముమ్మరం చేయడంతో రసవత్తరంగా మారింది. పోటా పోటీగా చేరికలు జరుగుతున్నాయి. ఇంటింటా ప్రచారాలు జోరుగా, హుషారుగా చేస్తున్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, మున్సిపాలిటీలో గ్రేడ్ యూనియన్లను, మహిళలను, యువతను కలుపుకుపోతున్నారు. ఎవరు ప్రచారం చేసినా ఎక్కడా ఆదరణకు లోటు కనిపించలేదు. అందరూ మీకే ఓటు వేస్తామని అంటున్నారు. నామినేషన్ కార్యక్రమాలకూ బలప్రదర్శన స్థాయిలో ఎవ్వరూ తగ్గలేదు. చివరికి ఎవ్వరు పక్షాన ఓట్లు పడతాయోనని టెన్షన్ అభ్యర్థుల్లో ఉంది. సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే అందిస్తున్నాం... తప్పకుండా ఈ సారి ఓట్లు ఫ్యాన్ గుర్తుకే వస్తాయని వైసిపి నేతలు, ధరలు పెరుగుదల ప్రభుత్వంపై వ్యతిరేకత తమకే పూర్తిగా అనుకూలిస్తాయని టిడిపి శ్రేణులు, ఇండియా ఫోరం అభ్యర్థులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. పార్టీలు బయటకు గంభీరంగా గెలుస్తామని చెబుతున్నా... లోలోన మాత్రం భయం నెలకొంది. ఇప్పటి వరకు ప్రచారాలు, ప్రలోభాలు, హామీలతో ఒకరకంగా ఉంటే... చివరిగా పోల్‌మేనేజ్‌మెంట్ ఎవ్వరిది పైచెయ్యి అయితే విజయావకాశాలు వారికి దక్కే అవకాశాలు మెండుగా ఉన్నాయని ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. ఏదేమైనా ఈ ఎన్నికలు పెద్దా సవాల్‌గా తీసుకున్నారు. ఎవ్వరూ ఎక్కడా తగ్గకుండా దొరికిన ప్రతి అవకాశాన్నీ సద్వినియోగం చేసుకుంటున్నారు. ఎత్తులు పై ఎత్తులతో ఎన్నికల రణరంగంలో ఉపయోగించే అన్ని అస్త్రాలు, శాస్త్రాలతో పోటీ పడుతున్నారు. పోలింగ్ దగ్గర పడుతున్నకొద్దీ ఎవ్వరికి ప్రజలు పట్టం కడతారని సర్వత్రా ఉత్కంఠతో ప్రచారం చేస్తున్నారు.

మామా అల్లుళ్ల రసవత్తర పోటీ

మధ్యలో సువ్వారి

ప్రజాశక్తి- ఆమదాలవలస

జిల్లాలో రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారి కాళింగ సామాజిక తరగతి కోటగా ప్రసిద్ధి చెందిన ఆమదాలవలస నియోజకవర్గంలో రసవత్తర పోటీ నెలకొంది. ఒకప్పటి నగరికటకం నియోజవర్గం నుంచి నియోజ కవర్గాల పునర్విభజనలో ఆమదాలవలస నియోజకవర్గంగా ఏర్పడిన నాటి నుంచి జరిగిన ఎన్నికల్లో ఆ సామాజికవర్గ అభ్యర్థులే పోటీ చేసి ఇక్కడ శాసన సభ్యులుగా కాళింగ తరగతికి చెందిన వ్యక్తులే ఎన్నికవుతున్నారు. బొడ్డేపల్లి, తమ్మినేని, కూన, పైడి, కిల్లి ఈ ఐదు ఇంటి పేర్లు ఉన్న కాళింగ సామాజిక తరగతి వ్యక్తులే ఇప్పటివరకు గతంలోని నగిరి కటకం, ఇప్పటి ఆమదాలవలస శాసన సభ్యులు గా విజయం సాధించారు. గత కొంతకాలం వరకు బొడ్డేపల్లి, తమ్మినేని కుటుంబాల మధ్య పోటీ నెలకొనగా తాజాగా గత మూడు శాసనసభ ఎన్నికల నుంచి తమ్మినేని, కూన కుటుంబాల మధ్య ఎన్నికల కురుక్షేత్రం కొనసాగుతుంది. అయితే గడచిన ఎన్నికల్లో అప్పుడప్పుడు ఇతర సామాజిక తరగతితో పాటు కాళింగ సామాజిక వర్గ అభ్యర్థులు కూడా అసెంబ్లీ ఎన్నికల్లో నామినేషన్లు వేసి ఆమదాలవలస నియోజకవర్గ ఎన్నికల వేడిని శ్రీకాకుళం జిల్లాతో పాటు రాష్ట్ర దృష్టిని కూడా ఆకర్షించేవారు. వీటన్నిటికీ భిన్నంగా ప్రస్తుతం జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో మామ, అల్లుడైన తమ్మినేని సీతారాం, కూన రవికుమార్ అసెంబ్లీ అభ్యర్థులుగా నామినేషన్ వేసి నువ్వా నేనా అన్నట్టుగా ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఈనెల 18 నుంచి స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో కొంతమంది స్వతంత్ర అభ్యర్థులు, కాంగ్రెస్, బిఎస్‌పి, జై భారత్, నేషనల్ జాతీయ చేతి వృత్తుల ఐక్యవేదిక అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసినప్పటికీ ఇదంతా నామ మాత్రమే. సీతారాం, రవికుమార్‌ల మధ్యే ప్రధాన పోటీ ఉంటుందని పట్టణ ప్రజలతో పాటు నియోజకవర్గ ప్రజలకు కూడా భావించారు. అయితే తాజాగా వైసిపి తరుపున నియోజకవర్గ అసెంబ్లీ టికెట్ ఆశించి భంగపడ్డ పొందూరు మండలానికి చెందిన సీనియర్ నాయకులు సువ్వారి గాంధీ ఆ పార్టీకి రాజీనామా చేసి స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికల బరిలో ఉంటానంటూ ప్రకటించి నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, మున్సిపాలిటీ పరిధిలో తమ్మినేని, కూనలకు దీటుగా ప్రచారం నిర్వహించి ముచ్చెమటలు పట్టిస్తున్నారు. అయితే వైసిపి అధినాయకత్వం గాంధీని బుజ్జగిస్తుందని సీతారాం, రవికుమారుల మధ్యే ప్రధాన పోటీ ఉంటుందని అంతా అనుకున్నారు. ఎవరు ఎన్నిచెప్పినా ఆమదాలవలస నియోజకవర్గంలో తమ్మినేని, కూన కుటుంబాలపై స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేస్తానని ప్రకటించిన గాంధీ ఎవరు ఊహించని విధంగా బుధవారం భారీ జన సమీకరణతో నామినేషన్ వేయడంతో వైసిపి, టిడిపి ప్రధాన పార్టీల అభ్యర్థుల మధ్య కళింగ సామాజిక తరగతికి చెందిన మూడో వ్యక్తి రంగ ప్రవేశం చేశారంటూ పలువురు గుసగుసలాడుకుంటున్నారు. పొందూరు మండలానికి చెందిన గాంధీ వైసిపి ఆవిర్భావం నుంచి ఆ పార్టీలో క్రియాశీలక నాయకునిగా గుర్తింపు పొందిన వ్యక్తి కావడంతో నియోజవర్గంలో ఉన్న వైసిపి కార్యకర్తలు, నాయకులు గాంధీ వెంట వెళ్తుండడంతో శాసనసభాపతి, ప్రస్తుత వైసిపి అభ్యర్థి తమ్మినేని సీతారాంకు భారీ స్థాయిలోనే ఓట్లు గండి పడటం ఖాయమని పలువురు అభిప్రాయ పడుతున్నారు. టిడిపి అభ్యర్థి రవికుమార్‌కు ఈ ఎన్నికల్లో పొందూరు మండలం నుంచే ఎక్కువ మెజార్టీ సాధిస్తారన్న సమయంలో అదే మండలానికి చెందిన గాంధీ స్వతంత్ర అభ్యర్థిగా రంగంలో నిలవడంతో అక్కడ వైసిపి, టిడిపిల ఓటు బ్యాంకును ఎంతమేర కొల్లగొడతారోనని రాజకీయ విశ్లేషకులు తర్జనభర్జన పడుతున్నారు. ఏది ఏమైనప్పటికీ జిల్లాలో కళింగ కోటగా ప్రసిద్ధిగాంచిన ఆమదాలవలస నియోజకవర్గంలో అటు తమ్మినేని ఇటు కూన మధ్యలో సువ్వారి నామినేషన్లతో పోటి రసవత్తరంగా మారి కాక పుట్టిస్తుందనడంలో ఎటువంటి సందేహం లేదని పలువురు చర్చించుకుంటున్నారు.

సీతారాం

రవికుమార్

సువ్వారి గాంధీ

జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి

ప్రజాశక్తి- బూర్జ

రాష్ట్ర అభివృద్ధి సిఎం జగన్మోహన్ రెడ్డితోనే సాధ్యమని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. గురువారం కొల్లివలసలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందజేసే ఘనత సిఎం జగన్మోహన్ రెడ్డిదేనని, సంక్షేమం చూసి ఓటు వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర టిట్కో డైరెక్టర్ గోవిందరావు, జెడ్‌పిటిసి రామారావు, ఎంపిపి ప్రతినిధి నాగేశ్వరరావు, వైస్ ఎంపిపిలు సూర్యారావు, కృష్ణం నాయుడు, ఎంపిటిసి గుమ్మడి రాంబాబు, సర్పంచ్ వేలు రామకృష్ణ పాల్గొన్నారు.

పొందూరు: మండలం కృష్ణాపురంలో స్పీకర్ తమ్మినేని సీతారాం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటా తిరుగుతూ మళ్లీ అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే వైసిపిని గెలిపించాలని కోరారు. జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్ కుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, మాజీ సర్పంచ్ గార వెంకటరమణ, వైసిపి రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి బండారు జైప్రతాప్ కుమార్, గుడ్ల మోహనరావు, అశోక్, జనార్ధనరావు పాల్గొన్నారు.

పొందూరు : ఎన్నికల ప్రచారం చేస్తున్న సీతారాం

'చేయూత' ఇక అంతేనా?

- ఆశగా ఎదురుచూస్తున్న మహిళలు
- 40 రోజులు దాటినా జమ కాని డబ్బులు
- విద్యా దీవెనదీ అదే పరిస్థితి
- చివర్లో చేతులెత్తేస్తున్న ప్రభుత్వం

ప్రజాశక్తి - కవిటి:
బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీలకు చెందిన 45-60 సంవత్సరాల మధ్య వయస్సు గల మహిళలకు దేశంలో ఎక్కడా లేని విధంగా అండగా ఉంటూ చేయూత పథకం అందిస్తున్నామన్న ప్రభుత్వం మాటలు నీటిమూటలే అవుతున్నాయి. ఏడాదికేడాది కుదించుకుంటూ పోయిన ఈ పథకం చివరి ఏడాదిలో లబ్ధిదారులకు పరీక్ష పెడుతోంది. దీంతో గత 40 రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా చేయూత పథకం డబ్బుల కోసం మహిళా లోకం కళ్లల్లో ఒత్తులు వేసుకుని ఎదురుచూస్తోంది. వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల్లో ఎంతో గొప్పగా చెప్పుకునే చేయూత పథకం మొదటి ఏడాది సక్రమంగా అమలు చేసినా ఆ తరువాత నిబంధనల పేరుతో ప్రభుత్వం కుదించుకుంటూ పోయింది. ఇక చివరి ఏడాదికి వచ్చేసరికి పూర్తిగా అమలు చేసే పరిస్థితి కనిపించడం లేదు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మార్చి 7న బటన్ నొక్కి చేయూత పథకం డబ్బులు విడుదల చేశారు. అంతేకాకుండా రెండు, మూడు రోజులు ఆలస్యమైనా అందరి ఖాతాల్లోకి చేయూత డబ్బులు జమ చేస్తామని చెప్పారు. కానీ నేటికి 40 రోజులు దాటినా ఇప్పటికీ లబ్ధిదారుల ఖాతాల్లోకి చేయూత డబ్బులు మాత్రం జమ కాలేదు. దీంతో ఓవైపు డబ్బులు వస్తాయని ఆశగా ఎదురు చూస్తూనే మరోవైపు ఎన్నికల పేరుతో ఎగ్గొడతారేమోనని లబ్ధిదారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇక జిల్లాలో 1,75,225 మంది లబ్ధిదారులు చేయూత పథకం కోసం ఎదురుచూపులు చూస్తున్నారు.

విద్యా దీవెన పరిస్థితీ అంతే..

మరోవైపు విద్యా దీవెన పథకం పరిస్థితి అలాగే ఉంది. జిల్లా వ్యాప్తంగా సుమారు 39వేల మందికి పైగా విద్యార్థులు విద్యా దీవెన పథకం డబ్బులు కోసం ఎదురు చూస్తున్నారు. డిగ్రీ నుంచి ఆపై చదివే వారికి ఐటిఐ, పాలిటెక్నిక్ చదివే వారికి నాలుగు విడతల్లో ఈ పథకం అమలు చేసేవారు. గత మూడేళ్లలో కూడా పూర్తిస్థాయిలో ఈ పథకం అమలు చేసిన పరిస్థితి కనిపించడం లేదు. ఇక కరోనా సమయంలో అయితే కేవలం ఒక విడతతోనే సరి పెట్టేశారు. ఉదాహరణకి ఒక డిగ్రీ చదివే విద్యార్థి కాలేజి ఫీజు రూ.15వేలు అనుకుంటే ఆ విద్యార్థి తల్లి ఖాతాల్లోకి నాలుగు విడతల్లో ఆ డబ్బులు జమ చేస్తారు. కానీ ప్రస్తుత విద్యా సంవత్సరం ముగుస్తున్నా ఇప్పటివరకూ ఒక్క విడత కూడా నిధులు విడుదల చేయలేదు. గతంలో కూడా విద్యా దీవెన డబ్బులు సరిగా రాకపోవడంతో ఎంతోమంది విద్యార్థులు తమ సర్టిఫికెట్ల కోసం కళాశాలల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో అటు విద్యార్థులతో పాటు కళాశాలల మనుగడే ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారుతోంది. ప్రస్తుతం ఎన్నికల సీజన్ ప్రారంభం కావడంతో ఇక వీటిపై ఆశలు వదులుకోవాల్సిందేనని పలువురు లబ్ధిదారులు వాపోతున్నారు.

ఎన్నికలని అంటున్నారు

చేయూత డబ్బులు కోసం చాలామందిని అడిగితే ప్రస్తుతం ఎన్నికలు కదా ఇప్పుడు డబ్బులు ఇవ్వరని అంటున్నారు. కానీ ఎన్నికలకు ముందే చేయూత పథకం అమలు చేశారు. ఆరోజు స్వయంగా ముఖ్యమంత్రే డబ్బులు కూడా ఇస్తామనే చెప్పారు. ఇప్పటికి కూడా డబ్బులు వస్తాయనే ఎదురు చూస్తున్నాం.

- షావుకారి పద్మ, రామయ్యపుట్టుగ

కళాశాలలు నడపడమే కష్టంగా ఉంది

ప్రస్తుత పరిస్థితుల్లో కళాశాలలు నడపడమే కష్టంగా ఉంది. ఈ విద్యా సంవత్సరం చివరి దశకు చేరుకున్నా ఇప్పటికీ విద్యా దీవెన డబ్బులు విడుదల కాలేదు. విద్యార్థులు డబ్బులు వస్తేనే కడతామని అంటున్నారు. ప్రస్తుతం సిబ్బంది జీతాలకు కూడా ఇబ్బందులు పడుతున్నాం. ఇది ఒక మా కళాశాల పరిస్థితి మాత్రమే కాదు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కళాశాలల పరిస్థితి.

- పి.కృష్ణారావు, బి.ఎస్.ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, కవిటి కొత్తూరు

ఎదురుచూస్తూనే ఉన్నాం

చేయూత డబ్బులు వస్తాయని ఎదురు చూస్తూనే ఉన్నాం. ఇప్పటికే చాలాసార్లు బ్యాంకుకు వెళ్లి అడిగితే డబ్బులు రాలేదని చెప్పారు. గతంలో నాతో పాటు డబ్బులు వచ్చిన చాలా మందికి ఆ తరువాత రాలేదు. ఇప్పుడు మిగతా వారికి కూడా వస్తాయో రావో అన్న విధంగా ఉంది.

- బెందాళం సరోజిని, కవిటి

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

కవిటి: మండలంలోని బొరివంక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఇఇ జి.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 33 కెవి లైన్ మైంటేనెన్స్ పనులు, చెట్లు కొమ్మలు తొలగించనున్న పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మాణిక్యపురం, బల్లిపుట్టుగ, కుసు ంపురం, బొరివంక, బి.జి.పుట్టుగ, ఇద్దివానిపాలెం, దూగాన పుట్టుగ, వరక పంచాయతీల పరిధిలోని గ్రామాలకు, ఆర్‌డబ్ల్యుఎస్ కనెక్షన్లకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు. వినియో గదారులు సహకరించాలని కోరారు.

పరామర్శిస్తున్న వైసిపి నాయకులు

ఎన్నికల పరిశీలకులు పరిశీలన

టెక్కలి : వచ్చే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల పరిశీలకులు సందీప్‌కుమార్ గురువారం టెక్కలి వచ్చారు. ముందుగా సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి నూరుల్ కమర్‌తో ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ, తదితర అంశాలపై చర్చించారు. ఆనంతరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలోని స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు. ఏర్పాట్లు, వినియోగం వంటి వాటిపై చర్చించారు. ఈయనతో పాటు స్థానిక అధికారులు ఉన్నారు.

అండగా ఉంటాం

కోటబొమ్మాళి: మండలంలోని మాసాహెబ్‌పేట పంచాయతీ కమలనాభపురానికి చెందిన దువ్వారపు అప్పన్న, మద్దిల మల్లేషులు బుధవారం టెక్కలి సిద్ధం సభలో ఫ్లెక్సీ పడి గాయపడ్డారు. వీరు టెక్కలి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరికి ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, ఎఎంసి వైస్ చైర్మన్ బొడ్డు వెంకటరమణ, మండల విప్ బొడ్డు అప్పన్న, వైసిపి నాయకులు పేడాడ వెంకటరావు, సత్యం, లక్ష్మణ, పున్నయ్యలు గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు.

'దువ్వాడ'ను గెలిపించాలి

కోటబొమ్మాళి: మధ్యవర్తులు లేకుండా ఇంటింటికీ సిఎం జగన్ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని, ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌ను ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు నూక సత్యరాజులు ఓటర్లను కోరారు. మండలంలోని రేగులపాడు పంచాయతీలో స్థానిక కన్వీనర్లు, గృహసారథులతో గురువారం ఇంటింటికీ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, సచివాలయ కన్వీనర్ గడ్డవలస నాగభూషణరావు, మండల విప్ బొడ్డు అప్పన్న, కవిటి రామరాజు, మెట్ట సింహాచలం, బమ్మిడి గణపతి, పేడాడ వెంకటరావు, జనార్ధనరావు, సంజీవరావు పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్'పై అవగాహన

వజ్రపుకొత్తూరు: సైకిల్ గుర్తుపై ఓటు వేసి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గౌతు శిరీష, ఎంపీ అభ్యర్థి రామ్మోహన్ నాయుడులను గెలిపించాలని పూడి క్లస్టర్ ఇన్‌ఛార్జి పుచ్చ ఈశ్వరరావు ఓటర్లను కోరారు. మండలంలోని దేవునల్తాడ పంచాయతీలో టిడిపి నాయకులు ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కర్ని రమణ, తుళి అప్పోజీ, తుళి కృష్ణ, పాపారావు, జోగారావు, చింత యోగేశ్వరరావు, గాడి అఖిల్, గాడి అప్పారావు, నారాయణస్వామి, తంబనాథ్ పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు

రాజకీయ సుడిగుండంలో భవన నిర్మాణాలు

- ప్రారంభానికి నోచుకోని వైనం
- రూ.లక్షల ప్రజాధనం వృథా

ప్రజాశక్తి- టెక్కలి
ప్రజా సంక్షేమానికి నిర్మించిన భవనాలు ప్రారంభానికి నోచుకోవడం లేదు. లక్షలాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన భవనాలు రాజకీయాల సుడిగుండంలో చిక్కుకుని ప్రారంభం కాలేదు. దీంతో ఈ భవనాలు వృథాగా పడి ప్రారంభానికి ముందే శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. టెక్కలిలో గత ప్రభుత్వ హయాంలో రైతుబజారు, హుదూద్ ఇళ్లు, చేపల బజారులో వాణిజ్య సముదాయాలు నిర్మించారు. అయితే అవి నిర్మించి ఐదేళ్లు కావస్తుంది. స్థానిక పాత బస్టాండ్ ఆవరణలో గతంలో క్లబ్ ఉండేది. ఆ స్థలం దురాక్రమణ జరుగుతుండడంతో వాటిని కాపాడాలనే ఉద్దేశంతో ఆప్పట్లో మంత్రి హోదాలో కింజరాపు అచ్చెన్నాయుడు ఆ ప్రదేశంలో రైతుబజారు నిర్మించారు. అయితే అప్పట్లో ఎన్నికల కోడ్ అమలుల్లోకి రావడంతో అది ప్రారంభించలేదు. తర్వాత అధికారం చేపట్టిన ప్రభుత్వం దానిని ప్రారంభించాల్సి ఉన్నా.. వాటి జోలికి వెళ్లలేదు. పర్యవసానం లక్షలాది రూపాయల వ్యయంతో నిర్మించిన రైతుబజారు భవనాలు నేడు వృథాగా మారి, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది.

వృథాగా ఉన్న హుదూద్ ఇళ్లు

ఇక్కడ రైతుబజారు ప్రారంభిస్తే చాలా వరకు రోడ్ల పక్కన వ్యాపారాలు నిలిచిపోతాయి. రాజకీయాల పట్టింపులు కారణంగా రైతుబజారు ప్రారంభించలేదని తెలుస్తోంది. అదేవిధంగా స్థానిక చిన్నబజారు కూడలి వద్ద వాణిజ్య సముదాయాల భవనాలు నిర్మించారు. పాత ఆస్పత్రి ఎదురుగా ఉన్న కాటా బంద స్థలమూ ఆక్రమణ జరుగుతున్న నేపథ్యంలో వాటిని నిరోధించాలనే ఉద్దేశంతో అప్పట్లో అచ్చెన్నాయుడు 190 హుదూద్ ఇళ్ల నిర్మాణం చేపట్టారు. కొన్నేళ్ల పాటు అవి వృథాగా పడి ఉండడంతో ఇటీవల ప్రభుత్వం వాటిని వినియోగంలోకి తీసుకొచ్చిరు. అప్పట్లో ఈ ఇళ్లు ఎవరెవరికి మంజూరు జరిగిందనే జాబితా ఒకటి రూపొందించారు. అయితే ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ మాత్రం 90 ఇళ్లు పంపిణీ చేశారు. అయితే అప్పటి జాబితాలో ఉన్న వారికి కాకుండా తన అనుయాయులకు కట్టబెట్టారని ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో సుమారు వంద ఇళ్ల పంపిణీకి నోచుకోలేదు. దీనిపై చర్చలు జరిగిన తర్వాత పేదలకు ఇద్దామనుకునే సమయంలో దువ్వాడ దంపతుల మధ్య నెలకున్న విభేదాల కారణంగా జాబితా నిలిచిపోయింది. ప్రజా సంక్షేమానికి నిర్మించిన భవనాలు ప్రారంభానికి నోచుకపోవడంతో లక్షలాది రూపాయలతో నిర్మించిన భవనాలు వృథాగా మిగిలిపోయాయి. ఎన్నికల తర్వాత అధికారం చేపట్టబోయే ప్రభుత్వం వీటిపై ఏ విధంగా నిర్ణయం తీసుకుంటుదో వేచి చూడాలి.

శిథిలావస్థలో రైతుబజారు భవనాలు

గుర్రపుడెక్క తొలగించేదెప్పుడో..?

ప్రజాశక్తి- టెక్కలి
వంశధార మెయిన్ కెనాల్ నుంచి వస్తున్న నీటితో నిల్వ ఉన్న మదనగోపాలసాగరం ఆయుకట్టు స్థలంలో గుర్రపుడెక్క పేరుకుపోయింది. దీనిని తొలగించడంలో ఏర్పడుతున్న జాప్యం వల్ల గతేడాది, ఈ ఏడాది ఖరీఫ్‌కు శివారు ప్రాంత రైతాంగానికి సాగునీరు అందడం గగనంగా మారుతుంది. వంశధార 46 ఆర్ మెయిన్ కెనాల్ నుంచి సాగునీరు సరఫరా జరుగుతుండేది. టెక్కలి దరి లచ్చన్నపేట వద్ద ఉన్న మదనగోపాలసాగరంలో నీరు చేరుతుంది. అక్కడ నుంచి ఏర్పడిన చిన్నపాటి కాలువల ద్వారా పలాస మండలంలోని పలు ప్రాంతాల్లోకి నీరు చేరాలి. అయితే మదనగోపాలసాగరం, వంశధార మెయిన్ కెనాల్ వద్ద గల నీటిలో గుర్రపుడెక్క పూర్తిగా నిండిపోవడంతో వంశధార నీటి ప్రవాహానికి ఆటంకంగా మారుతుంది. దశాబ్దాల కాలం నుంచి ఈ సమస్య ఉన్నా ప్రభుత్వం, వంశధార అధికారులు గుర్రపుడెక్క తొలగించడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారని రైతులు వాపోయారు.

మదనగోపాలసాగరంలో పేరుకుపోయిన గుర్రెపుడెక్క

మదనగోపాలసాగరం శుభ్రం చేస్తే మరింతగా నీటి నిల్వ సామర్థ్యం పెంచుకోవచ్చునని రైతులు భావిస్తున్నారు. ఈ విషయమై వంశధార అధికారుల దృష్టికి ప్రజా ప్రతినిదులు పలుమార్లు తీసుకెళ్లినా గుర్రపుడెక్క తొలగింపు చేపట్టలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మదనగోపాల సాగరం సిల్టు క్లియరెన్స్ పనులూ చేపట్టకపోవడం గమనార్హం. ఈ వేసవి కాల సమయంలో మదనగోపాలసాగరంలోని గుర్రపుడెక్కని తొలగించి, సిల్టు క్లియరెన్స్ పనులు చేపడితే రానున్న వర్షాకాల సమయంలో నీటి ప్రవాహం మెరుగుపడే ఆవకాశం ఉంటుందని రైతులు అంటున్నారు.

రాజకీయ క్రీడలో బలిపశువులం

ప్రజాశక్తి- కవిటి
రాజకీయ క్రీడలో అటు ప్రజా ప్రతినిధులు, ఇటు రెవెన్యూ అధికారుల తీరుతో 20 ఏళ్లుగా మోసపోతూనే ఉన్నామని బెంతు ఒరియా ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారుల తీరును నిరసిస్తూ మండల కేంద్రంలో బెంతు ఒరియాలు చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 120వ రోజుకి చేరుకున్నాయి. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ పూర్తి స్థాయిలో కులం, ఉపకులం పేరుతో కూడిన ఇంటిగ్రేటెడ్ ధ్రువపత్రం జారీ చేయకపోవడంతో విద్యార్థులు ఉపాధి, ఉన్నత చదువులు కోల్పోతున్నారని అన్నారు. ఫీజు రీఎంబర్స్‌మెంట్ మంజూరు కావడం లేదని అన్నారు. సమస్య పరిష్కరించే వరకూ తమ పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

దీక్షలో పాల్గొన్న బెంతు ఒరియాలు

చేనేతకు ఆదరణ కరువు

ఆగని వలసలు

ప్రజాశక్తి- పలాస

పూర్వకాలం నుంచి చేనేత కార్మికులకు ఒక ప్రత్యేక గుర్తింపు, గౌరవం ఉండేది. నూలుపోగులతో రంగురంగుల అందమైన వస్త్రాలు తయారు చేసి విక్రయిస్తూ జీవనం సాగించేవారు. చేనేత కార్మికులు నివాసముంటున్న ప్రాంతాల్లో ఒక సందడి వాతావరణం నెలకొండేది. వీధుల్లో పెద్దపెద్ద సరులు, అల్లులు చేపట్టేవారు. చేనేత వస్త్రాలు తయారు చేసేందుకు ఆదాయం కన్నా కష్టం ఎక్కువగా ఉన్నప్పటికీ కులవృత్తిని విడిచిపెట్టక కుటుంబమంతా చేనేత వస్త్రాలు తయారు చేస్తూ జీవనం గడిపేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు. పోకుపోకు కష్టాలే ఎదురయ్యాయి. కులవృత్తి తిండి పెట్టకపోవడంతో దూరమవుతున్నారు.

జిల్లాలో వేల సంఖ్యలో చేనేత కార్మికులు ఉన్నా... ప్రస్తుతం పదుల సంఖ్యలో చేనేత వృత్తి చేపడుతున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. చేనేత కార్మికులకు ప్రోత్సాహం అందిస్తాం, పూర్తిస్థాయిలో సహాయ, సహకారాలు అందిస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెప్పడమే తప్ప ఆచరణకు నోచుకోవడం లేదు. చేనేత సొసైటీలు సక్రమంగా నడకపోవడంతో సొసైటీలు మూలకు చేరాయి. ప్రస్తుతం చేనేత కార్మికులకు చేతినిండా పని లేకుండాపోయింది.

మగ్గం వేస్తున్న చేనేత కార్మికుడు

ఆదాయం కన్నా కష్టం ఎక్కువ

చేనేత కార్మికులు తయారు చేసిన వస్త్రాలకు ఆదాయం అంతంత మాత్రమే ఉండేది. వారంతా కుటుంబమంతా శ్రమిస్తే రోజుకు రూ.200లు కూడా ఆదాయం వస్తూండేది కాదు. నూలు కొనుగోలు చేసిన మొదలు డబ్బాలు, కండిలు పట్టడం పట్టిన డబ్బాలను ఆసుపై పడుగు పట్టడం చేయాలి. అనంతరం పట్టిన పడుగును వీధి మధ్యలో సుమారు నాలుగు గంటల పాటు కుటుంబ సభ్యులంతా కలిసి సరి చేయాలి. అనంతరం పోగు పోగును సుమారుగా మూడు గంటల పాటు అంతికించి మరో గంట పాటు వీధి మధ్యలో అల్లు పట్టాలి. అనంతరం నాలుగు రోజుల పాటు కష్టపడితే చీరలు తయారవుతుంది. ఇంతా శ్రమించి తయారు చేసిన వస్త్రాలకు మార్కెట్లో ధర పలకడంతో ఎంతోకొంత మొత్తానికి విక్రయించే పరిస్థితి నెలకొంది. ఎక్కువ శాతం చేనేత కార్మికులు ఇంత కష్టాన్ని శ్రమించు లేక హైదరాబాద్, విశాఖపట్నం, రాజమండ్రి, చెన్నయ్, కలకత్తా తదితర ప్రాంతాలకు వలస కూలి పనులు చేసుకుంటున్నారు. మరికొంత మంది గ్రామాల్లో తిరుగుతూ మసాలా దినుసులు విక్రయిస్తూ జీవనాన్ని గడుపుతున్నారు.

వందల కుటుంబాలు వలస బాట

జిల్లాలో పలాస, లావేరు, మందస, భైరిసారంగపురం, సోంపేట, జింకిభద్ర, పెద్ద తామరాపల్లి, ఎం.ఎస్ పల్లి, బ్రాహ్మణతర్లా, చాపర, పొందూరు పలుచోట్ల చేనేత కార్మికులు పెద్ద ఎత్తున ఉన్నారు. చేనేతపై వస్తున్న ఆదాయం కన్నా ప్రస్తుత పరిస్థితుల్లో నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో జీవనం సాగించలేక వలసలు బాటపట్టారు. ఎక్కువగా చేనేత యువకులు టైలర్ పని ఎంచుకొని హైదరాబాద్, విశాఖపట్నం, తిరుపతి, ముంబై తదితర ప్రాంతాలకు వెళ్లి జీవనం సాగిస్తుండగా కొంత మంది గ్రామంలో నివాసం ఉంటూ చిరు వ్యాపారులు, గ్రామాల్లో తిరుగుతూ బట్టలు లైన్ వ్యాపారం, మసాల దినుసులు అమ్ముకుంటున్నారు. మరి కొంత మంది హైదరాబాద్, విశాఖపట్నం, ఒడిషా తదితర ప్రాంతాల్లో కూలీ పనులు, కంపెనీలో పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఏదేమైనా చేనేత కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహం లేకపోవడంతో వందల కుటుంబాలు వలస పోతున్నారు.

వెంకటరమణతో గోవిందరావు

కలమటను కలిసిన ఎంజిఆర్

ప్రజాశక్తి- పాతపట్నం

పాతపట్నం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణని అధిష్టానం టిడిపి జిల్లా అధ్యక్షునిగా నియమించారు. టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి మామిడి గోవిందరావు వెంకటరమణను గురువారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే గెలుపునకు మీ ఆశీస్సులు ఉండాలని గోవిందరావు కోరారు. పార్టీ ఆదేశాల మేరకు అందరమూ కలిసి పనిచేద్దామని, ఎమ్మెల్యే గెలుపునకు కృషి చేస్తామని వెంకటరమణ ఎంజిఆర్‌కు భరోసా ఇచ్చారు.

కొత్తూరు : శ్రీకాకుళం పార్లమెంట్ జిల్లా అధ్యక్షులుగా పాతపట్నం మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణను నియమించడంతో పలువురు శుభాకాంక్షలు తెలిపారు. మతలలోని వెంకటరమణ క్యాంప్ కార్యాలయానికి ఈ మేరకు ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, అగతముడి భైరిగినాయుడు, కర్లెరమ్మ సర్పంచ్ లోతుగెడ్డ భగవాన్‌దాస్ నాయులు వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు.

కార్యకర్తలకు కృతజ్ఞతలు

ప్రజాశక్తి- కవిటి

ఎమ్మెల్యే అశోక్

తన నామినేషన్ కార్యక్రమానికి తరలివచ్చిన ప్రజానీకానికి ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ కృతజ్ఞతలు తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ధన్యవాదాలు తెలిపారు. మీ నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఇదే స్ఫూర్తితో పనిచేసి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.

మాట్లాడుతున్న గోపి

పాలిసెట్ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

ఈ విద్యా సంవత్సరంలో ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్ డిప్లొమో కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 27న నిర్వహించే పాలిటెక్నిక్-2024 ప్రవేశ పరీక్ష నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్టు టెక్కలి పాలిసెట్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎ.గోపి తెలిపారు. ఈ మేరకు ఐతమ్ కళాశాలలో పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, జాయింట్ సూపరింటెండెంట్లు, పరిశీలకులు, రూట్ ఆఫీసర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. పాలీసెట్ ప్రవేశ పరీక్ష సజావుగా జరిగేందుకు తగిన సూచనలు చేశారు. 27న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష ఉంటుందని అన్నారు. విద్యార్థులకు పరీక్షా కేంద్రాల లోపలకు ఉదయం 10 గంటల నుంచే అనుమతి ఉంటుందని అన్నారు. 11 తరువాత అనుమతించబోమని స్పష్టం చేశారు. టెక్కలిలోని 16 కేంద్రాల ద్వారా 4812 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. క్యాలికేటర్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను విద్యార్థులు పరీక్షా కేంద్రాలలోకి తీసుకురాకూడదన్నారు. సమావేశంలో పాలిటెక్నికల్ కాలేజీ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

నందిగాం : అవగాహన కల్పిస్తున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

ప్రజాశక్తి- నౌపడ

ప్రతిఒక్కరూ స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని టెక్కలి సబ్ కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి నూరుల్ కమర్ ఓటర్లను కోరారు. సంతబొమ్మాళి మండలంలో గురువారం పెద్దమర్రిపాడులో పోలీసు, రెవెన్యూ, పంచాయతీ అధికారులతో కలిసి ఓటర్లను చైతన్యపరిచారు. గ్రామంలో అధికారులతో మార్చ్ నిర్వహించి అనంతరం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు సహకరించాలన్నారు. ఇటువంటి ప్రలోభాలకు లోన్ కాకూడదని, ఎవరైనా తమపై ఒత్తిడి చేస్తే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎన్నికల నియమావళిని పాటించాలన్నారు. అల్లర్లకు, గొడవలకు ప్రేరేపిస్తే వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హింసాత్మకంగా వ్యవహరించిన వారిపై రౌడీషీట్లు ఓపెన్ చేస్తామన్నారు. కార్యక్రమంలో సంతబొమ్మాళి తహశీల్దార్ సత్యనారాయణ, టెక్కలి డిఎస్‌పి బాలచంద్రారెడ్డి, టెక్కలి సిఐ సూర్యమౌళి, నౌపడ ఎస్ఐ కిశోర్‌వర్మ, ఎంపిడిఒ ఉమాసుందరి, బిఎల్‌ఒలు పాల్గొన్నారు.

నందిగాం : మండలంలోని నరేంద్రపురంలో పోలీసులతో ఎన్నికల అధికారి నూరుల్ కుమార్ మార్చి ఫాస్టు నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రైనీ డిఎస్‌పి సిహెచ్.రాజా, నందిగాం ఎస్ఐ మహమ్మద్ అమీర్ ఆలీ పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

పలాస : పలాస టిడిపి కార్యాలయంలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష సమక్షంలో మందస మండలం కొండలోగం పంచాయతీ రామరాయి ఉప సర్పంచ్ సవర తేజేశ్వరరావు, అపర్ణ, కుంటుకోట పంచాయతీ కమలాపురానికి చెందిన వైసిపి నాయకులు కొండియా ఈశ్వరరావు, కొండయ్య తేజేశ్వరరావు టిడిపిలో చేరారు. వారికి గౌతు శిరీష టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సవర లకీయ,

టిడిపి కండువా వేస్తున్న గౌతు శిరీష

మోహనరావు, బాలకృష్ణ, భాస్కరరావు, ఫల్గున్న, రామయ్య, జగ్గారావు, త్రినాథ్, భావన దుర్యోధన, రట్టి లింగరాజు, దాసరి తాతారావు, వయలపల్లి మధవరావు పాల్గొన్నారు.

అశోక్ సతీమణి ప్రచారం

మాట్లాడుతున్న నీలోత్పల

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

టిడిపితోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే బెందాళం అశోక్ సతీమణి నీలోత్పల అన్నారు. మండలంలోని తులిసిగాం పంచాయతీ ఇన్నీసుపేట, అవేటు, బలరాంపురం, లండపుట్టుగ గ్రామాల్లో గురువారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టిడిపి అమలు చేయనున్న సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి అశోక్, ఎంపీ అభ్యర్థి కె.రామ్మోహన్ నాయుడులను గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి దక్కత ఢిల్లీరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు, మంగి లక్ష్మి, దక్కత శ్రీను, కామేశ్వరరావు, ఎస్.సహదేవ్, కె.నరేంద్ర, ఎల్.పద్మనాభం, ఆశి చిరంజీవులురెడ్డి, పి.పరశురాం పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి మౌనిక

వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి- పలాస

మండలంలోని రెంటికోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉపాధి హామీ కూలీలకు, ప్రజలకు వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యాధికారి ఎస్.మౌనిక గురువారం అవగాహన కల్పించారు. ఎండలు తీవ్రంగా ఉండడంతో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటికి వెళ్లరాదని అన్నారు. బయటకు వెళ్లాల్సి వస్తే టోపీ, గొడుగు వెంట ఉంచుకోవాలని, వదులుగా ఉండే కాటన్ వస్తువులు ధరించి అన్నారు. డిహైడ్రేషన్ గురికాకుండా మజ్జిగ, చల్లని నీరు, నిమ్మరసం, కొబ్బరినీళ్లు లాంటివి ఎక్కువగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిహెచ్ఒ శ్యామలాదేవి, పిహెచ్ఎన్ సత్యవతి, సూపర్‌వైజర్ రుషికేశ్వరరావు, ఫార్మసీ ఆఫీసర్ బోనెల గోపాల్, ఈశ్వరమ్మ, రాణీప్రభ, సరస్వతి, పద్మావతి, ప్రభావతి, మేరీ, పార్వతి, కమల, భరద్వాజ్, తేజేశ్వరి, భారతి, పావని, నిహారిక, సుహాసిని పాల్గొన్నారు.

జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు

ప్రజాశక్తి- పలాస

జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో విశాఖపట్నం నారాయణ కళాశాలలో చదువుతున్న పలాస ప్రాంతానికి చెందిన విద్యార్థులు ఉత్తమ ర్యాంక్ సాధించారు. గున్న శేఖర్ రాష్ట్రంలో 452 ర్యాంకు సాధించగా, కేంద్రంలో 3485 ర్యాంకు సాధించారు. పొట్నూరు హితన్‌సాయి రాష్ట్రస్థాయిలో 479 ర్యాంకు సాధించారు. తమ్మినేని అమృత 4,466 ర్యాంకు సాధించింది. వీరికి పలాస డివిజన్ నారాయణ కళాశాల ఎజిఎం బమ్మిడి నారాయణ, ప్రిన్సిపాల్ ఉప్పాడ వెంకటేశ్వరరావులు అభినందించారు.

శేఖర్

హితన్‌సాయి

అమృత

జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న లింగరాజు

మలేరియాపై అవగాహన అవసరం

డిపిఎం లింగరాజు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

మలేరియాపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయ అర్బన్ డిపిఎం డాక్టర్ పి.లింగరాజు అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయం నుంచి నిర్వహించిన ర్యాలీని జెండా ఊపి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమకాటు వల్లే మలేరియా వస్తుందన్నారు. చలి, వణుకు, విపరీతమైన జ్వరం ఉంటాయని తెలిపారు. మలేరియా లక్షణాలు ఉన్నవాళ్లు నెలల తరబడి అనారోగ్యంతో ఇబ్బందులు పడుతూ ఉంటారని చెప్పారు. తక్షణమే వైద్య పరీక్షలు చేయించుకుంటే కొంతవరకైనా మలేరియా నుంచి దూరంగా ఉండవచ్చన్నారు. జ్వరం వచ్చిన వెంటనే పరీక్షలు చేసుకోవాలన్నారు. గర్భిణులు, పిల్లలు సకాలంలో పరీక్షలు చేసుకుని మందులు వాడాలన్నారు. మారుమూల ప్రాంతాల్లో ఆశా, ఆరోగ్య కార్యకర్తలు వ్యాధిని నిర్ధారించేందుకు ఇప్పటికే ర్యాపిడ్ డయాగ్నస్టిక్ కిట్లను సరఫరా చేశామని తెలిపారు. దోమతెరలు వాడాలని, ఇళ్లలో క్రిమిసంహారక మందు పిచికారీ చేసుకోవాలన్నారు. స్వచ్ఛంద సేవకులు మంత్రి వెంకటస్వామి మలేరియా రహిత శ్రీకాకుళంగా అందరం సామాజిక స్పృహతో, బాధ్యతతో సమాజాన్ని చైతన్యపరిచి మలేరియా నిర్ధారణ ఉచిత చికిత్సకు తోడ్పడతామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి పి.వి సత్యనారాయణ, ఎల్.శ్రీకాంత్, జిల్లా మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ, మలేరియా కన్సల్టెంట్ శ్రీకాంత్, అర్బన్ హెల్త్ సెంటర్ సూపర్‌వైజర్ లక్ష్మి, ఎఎన్ఎమ్‌లు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

అచ్చెన్నాయుడు విస్తృత ప్రచారం

కోటబొమ్మాళి: చంద్రబాబుతోనే అందరి ముఖాల్లో వెలుగులు వస్తాయని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మండలంలోని వింజాంపాడు, హరిశ్చంద్రపురం, బాపన్నపేట గ్రామాల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిడిపితోనే అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. ఒక ఛాన్స్ పేరుతో ప్రజలు ద్వారా ఓట్లు వేయించుకుని గెలిచిన తర్వాత జగన్ ప్రభుత్వం ప్రజలను నిలువునా మోసం చేసిందని ఆరోపించారు. జగన్ ప్రభుత్వ హయాంలో అవినీతి, అక్రమాలు, అరాచకాలు, భూ కబ్జాలు, ఇసుక మాఫియా, మైనింగ్ మాఫియా, ఎర్రచందనం అక్రమ రవాణా, హత్యలు, ఆత్మహత్యలు, అత్యాచారాలు, అక్రమ కేసుల బనాయింపు తప్ప సాధించింది ఏమీ లేదన్నారు. వెసిపి పాలనలో పేదలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. చివరకు న్యాయవాదులు సైతం రోడ్డుపైకొచ్చి పోరాటాలు చేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. కార్యక్రమంలో టెక్కలి నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షులు పూజారి శైలజ, మండల పార్టీ అధ్యక్షుడు బోయిన రమేష్, కింజరాపు హరివరప్రసాద్, వెలమల విజయలక్ష్మి, కామేశ్వరరావు, రామకృష్ణ, అప్పారావు, గొండు లక్ష్మణరావు, హనుమంతు అప్పలరాజు కోట సంతోష్, తిరుమలరావు, పల్లి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

అచ్చెన్నాయుడుకు స్వాగతం పలుకుతున్న నాయకులు

ప్రభం'జనం'గా శంకర్ నామినేషన్

హాజరైన ఎంపీ రామ్మోహన్ నాయుడు

శంకర్ నామినేషన్‌కు ర్యాలీగా వెళ్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

టిడిపి కూటమి తరపున శ్రీకాకుళం నియోజకవర్గం నుంచి గురువారం గొండు శంకర్ నామినేషన్ దాఖలు చేశారు. నగరంలోని ఏడురోడ్ల కూడలి నుంచి వాంబే కాలనీ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కళింగ రోడ్డు, పాతబస్టాండ్, జెడ్‌పి రోడ్డు, పాత శ్రీకాకుళం మీదుగా వాంబే కాలనీ వరకు ప్రత్యేక వాహనంలో ఎంపి కింజరాపు రామ్మోహన్ నాయుడుతో కలిసి ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. ఏడు రోడ్ల కూడలి వద్ద జరిగిన బహిరంగ సభలో వారు మాట్లాడుతూ శ్రీకాకుళం ఎంపీ స్థానం నుంచి రామ్మోహన్ నాయుడు, అసెంబ్లీ అభ్యర్థిగా గొండు శంకర్‌ను పెద్దఎత్తున ప్రజలు ఓటువేసి భారీ మెజారిటీ అందించాలని కోరారు. జగన్మోహనరెడ్డి కాలం చెల్లిపోయిందని, కోడికత్తి, గులకరాయి డ్రామాలకు ఈ ఎన్నికలతో తెర పడనుందన్నారు. ప్రజలకు కావాల్సింది అభివృద్ధి, సంక్షేమమని, వాటిని తాము చేసి చూపిస్తామన్నారు. సామాన్య కుటుంబ నేపథ్యం ఉన్న శంకర్‌ను ఎమ్మెల్యేగా గెలిపించుకోవాల్సిన అవసరముందని ఎంపీ పేర్కొన్నారు. శంకర్‌ను చూసి ప్రత్యర్థి ధర్మానకు భయం వెంటాడు తుందన్నారు. శ్రీకాకుళం అభివృద్ధి కోసం శంకర్‌ను గెలిపించాలన్నారు. శంకర్ మాట్లాడుతూ నియోజక వర్గంలో ఎన్నో సమస్యలు ఉన్నాయని, శ్రీకాకుళం -ఆమదాలవలస రోడ్డు అయిదేళ్లయినా అధికారంలో ఉన్న మంత్రి ధర్మాన పూర్తి చేయలేక చేతులెత్తేసారని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఈరోడ్డు నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. మత్యకారులకు జెట్టి కట్టించి స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. గార, శ్రీకాకుళం రూరల్ మండలాలు, నగర పరిధిలోని అన్ని డివిజన్‌ల నుంచి తరలివచ్చిన మహిళలు, యువత, విద్యార్థులు, టిడిపి, జనసేన, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఎంపి రామ్మోహన్ నాయుడుతో కలిసి తన నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి రంగయ్యకు అందజేసారు. కార్యక్రమంలో జనసేన నాయకులు డాక్టరు దానేటి శ్రీధర్, కోరాడ సర్వేశ్వరరావు, బిజెపి నాయకులు పైడి వేణుగోపాలం, చల్లా వెంకటేశ్వరరావు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

అట్టహాసంగా విజయ నామినేషన్

నామినేషన్ వేస్తున్న విజయ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం నియోజకవర్గ స్థానానికి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా పిరియా విజయ గురువారం నామినేషన్ వేశారు. ముందుగా అట్టహాసంగా వేలాదిమంది అభిమానులతో, కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించారు. కవిటి మండలంలోని స్వగ్రామం నుంచి నినాదాలతో హోరెత్తించారు. అక్కడి నుంచి బైక్ ర్యాలీ నిర్వహించి ఇచ్ఛాపురం పట్టణానికి చేరుకున్నారు. డమ్మీ నామినేషన్‌గా పిరియా రాజారావు నామినేషన్ వేశారు. మండుటెండను లెక్క చేయకుండా మారుమూల గ్రామాల నుంచి కార్యకర్తలు తరలించారు. పట్టణానికి చేరుకొనే సమయానికి రాత్రయ్యింది. ఈ సందర్భంగా విజయ, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ మాట్లాడుతూ 2024లో ఇచ్ఛాపురంలో వైసిపి జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలలను సిఎం జగన్ అభివృద్ధి చేశారని అన్నారు. కరోనా సమయంలోనూ ప్రజల మధ్య ఉన్నానని, మీరంతా ఎక్కడికి వెళ్లారని ఎమ్మెల్యే బెందాళం అశోక్, భార్య నీలోత్పలపై ఘాటుగా విమర్శించారు. మీరందరి సేవా చెయ్యడానికి అవకాశం ఇవ్వాలని, ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యేలు పిరియా సాయిరాజ్, నరేష్ కుమార్ అగర్వాల్, చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, సీడాప్ ఏపీ చైర్మన్ శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, వైస్ చైర్‌పర్సన్లు భారతి దివ్య, లాభాల స్వర్ణమణి, ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, నర్తు నరేంద్రయాదవ్, తులసీదాస్‌రెడ్డి, కాళ్ల సత్యం పాల్గొన్నారు.

నామినేషన్‌కు ర్యాలీగా వెళ్తున్న విజయ

కృష్ణదాస్ నామినేషన్‌కు జనసందోహం

నామినేషన్ వేస్తున్న కృష్ణదాస్

ప్రజాశక్తి- పోలాకి

వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మాన కృష్ణదాస్ నామినేషన్ జనసందోహం మధ్య గురువారం వేశారు. ముందుగా మబగాంలోని తన నివాసం నుంచి బయలుదేరిన కృష్ణదాస్ మార్గంమధ్యంలో నామినేషన్ పత్రాలపై సంతకాన్ని చేశారు. అక్కడి నుంచి మాకివలస, దేవాది మీదుగా సత్యవరం కూడలికి చేరుకున్నారు. వైసిపి ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, ధర్మాన రామదాస్, యువనేత డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్యలతో ప్రచార రథంపై ర్యాలీ నిర్వహించారు. కార్యకర్తలు, అభిమానులు భారీ ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం నామినేషన్ పత్రం ఆర్ఒ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో కృష్ణదాస్ సతీమణి పద్మప్రియ, డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ధర్మాన రామలింగంనాయుడు, ఎంపిపి వాన గోపి, ముద్దాడ భైరాగినాయుడు, ఆరంగి మురళి, కణితి కృష్ణారావు పాల్గొన్నారు.

నామినేషన్‌కు తరలివచ్చిన వైసిపి నాయకులు, కార్యకర్తలు

స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద భద్రతా ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబధించి నియమితులైన ఎన్నికల పోలీసు పరిశీలకులు దిగంబర్ పి.ప్రధాన్, సచ్చింద్ర పటేల్ ఎస్‌పి జి.ఆర్ రాధికతో కలిసి స్థానిక శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్ భద్రతా ఏర్పాట్లను గురువారం పరిశీలించారు. ఇవిఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్, కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించి అక్కడ భద్రత, బందోబస్తు ఏర్పాట్లపై పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. స్ట్రాంగ్‌రూముల వద్ద ఏర్పాటు చేసిన భద్రతా వివరాలు, గార్డ్ సిబ్బంది, ఇవిఎం బాక్సులను తీసుకొచ్చే రూట్‌మ్యాప్, కేంద్ర బలగాల సమన్వయంతో చేపట్టిన పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లను ఎస్‌పి పరిశీలకులకు వివరించారు. అనంతరం ఎన్నికల పరిశీలకులు సచ్చింద్ర పటేల్ జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్‌ను గౌరవపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఎన్నికల సన్నద్ధత, పోలీసు శాఖపరమైన అంశాలపై చర్చించారు. స్ట్రాంగ్‌రూమ్ పరిశీలనలో ఎఎస్‌పి జి.ప్రేమ్‌కాజల్, డిఎస్‌పి వై.శ్రుతి, ఎస్ఐ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

భద్రతా ఏర్పాట్లను వివరిస్తున్న ఎస్‌పి రాధిక